

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





**ఎన్నికల్లో హింసకు**
**పాల్పడితే ఊరుకోం**

- ప్రేరేపించే నేతలపై కఠిన చర్యలు
- డీజీపీ హరీష్‌కుమార్ హెచ్చరిక

- వివరాలు 3 లో..

## నవంబరు నుంచి
# చింతలపూడి పనులు పునః ప్రారంభం

**పోలవరం కుడి, ఎడమ కాలువల విస్తరణపై దృష్టి - నిరంతర కార్యక్రమంగా జలధార-జలహారతి**

**తుపాను, వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి - ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నా జలవనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష**

*రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసి 2028 డిసెంబరు నాటికి అన్ని ప్రాధాన్య ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అన్ని రకాల పర్యావరణ అనుమతులు లభించినందున ఈ ఏడాది నవంబరు నుంచే పనులను పునః ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం జలవనరుల శాఖపై సమీక్షించారు. రాష్ట్రంలో గుర్తించిన 36 ప్రాధాన్య ప్రాజెక్టులను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, ప్రతి ఎకరానికీ సాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని సీఎం పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. జలధార-జలహారతిని నిరంతర కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండడమే కాక వర్షపు నీటిని చెరువులు, రిజర్వాయర్లలో నింపుకోవాలని ఆదేశించారు.*

2



**నామినేషన్లు, ఏకగ్రీవాలపై**
## బయటపడుతున్న వైసీపీ ఫేక్ ప్రచారం

- వివరాలు 4 లో..



**కంసమామ: కుటుంబ బంధాలపై**
# గొడ్డలి వేటు

4




## స్థానిక ఎన్నికలను అడ్డుకోవడమే
# జగన్ అసలు అజెండా

- 16వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా చేసి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కల్పించే పన్నాగం
- కోర్టుల్లో 59 కేసులు వేయించి క్రిమినల్ లిటిగెంట్‌గా వ్యవహరిస్తున్న జగన్
- నామినేషన్లు వేయనీయట్లేదంటూ దొంగ ఏడుపులు
- లెక్కలు తీస్తే వైసీపీ నామినేషన్లే అధికం, వెబ్‌సైట్‌లో అందరికీ కనిపిస్తున్న వాస్తవం
- 2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవం చేసుకున్న జగన్
- సొంత బాబాయిని చంపి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ రాయించిన నీచ చరిత్ర జగన్‌ది
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు
- 2024లో పతనం మొదలైంది... ఇక వైసీపీ భూ స్థాపితం ఖాయం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

5





## గతం మరిచి
## నీతులు వల్లిస్తున్న జగన్

- గొడ్డలి పార్టీ హయాంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ అపహాస్యం
- గతంలో 'ఏకగ్రీవాల'ను ఘనంగా కీర్తించి నేడు వేరే పల్లవి
- నాడు స్థానిక ఎన్నికల్లో 82శాతం విజయాలు నిజమైతే, అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం ఓటములకు కారణాలు చెప్పు జగన్‌రెడ్డీ
- మంత్రి సత్యకుమార్ యాదవ్

8

## వైసీపీ మూకల
# వ్యవస్థీకృత హింస

- స్థానిక ఎన్నికలను అడ్డుకోవడమే వారి అజెండా
- చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఫిర్యాదు

5



# నవంబరు నుంచి చింతలపూడి పనులు పునః ప్రారంభం

- పోలవరం కుడి, ఎడమ కాలువల విస్తరణపై దృష్టి
- నిరంతర కార్యక్రమంగా జలధార-జలహారతి
- తుపాను, వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు
- సమర్థ నీటి నిర్వహణతో వర్షపు నీటి సద్వినియోగంపై దిశానిర్దేశం
- ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నా జలవనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష




అమరావతి (చైతన్యరథం): ఈ ఏడాది నవంబరు నుంచి చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఇప్పటికే పర్యావరణ అనుమతులన్నీ వచ్చినందున త్వరితగతిన పనులను పునః ప్రారంభించాలని జలవనరుల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయపరమైన అంశాల్లో బిజీగా ఉన్నప్పటికీ సీఎం రెండు గంటలకు పైగా సమయాన్ని జలవనరుల శాఖపై సమీక్షకు వెచ్చించారు. అటు బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రంలో జలవనరుల సమర్థ నిర్వహణ, నదుల అనుసంధానమే లక్ష్యంగా జలవనరుల శాఖ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గుర్తించిన 36 ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, 2028 డిసెంబరు నాటికి అన్ని ప్రాజెక్టులనూ అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటుచేసి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జలహారతి కార్పొరేషన్ ద్వారా జలవనరుల శాఖకు ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## పోలవరం కాలువల ద్వారా నేవిగేషన్ వ్యవస్థ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక అంశాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం పనులను చేపట్టాలని, అత్యుత్తమ నిపుణులను నియమించి ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. చారిత్రక ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 90.2 శాతం సివిల్ పనులు పూర్తయినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1, గ్యాప్-2 పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. నిపుణుల కమిటీ పలుమార్లు ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చినాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలువల ద్వారా గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించేలా వాటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలతోపాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోదావరి-పెన్నా అనుసంధానంపై కార్యాచరణ ప్రారంభించాలని, గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తరలించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన, దిగువన వైకుంఠపురం, చోడవరం వద్ద ఆనకట్టల నిర్మాణం ద్వారా 14 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలన్నీ క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు అంతర్గత జల రవాణాకు అవసరమైన నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

## జలధార-జలహారతి నిరంతర కార్యక్రమం

జలధార--జలహారతి రెండో దశ పనులను మార్చి 31 వరకు కొనసాగిస్తూ 150 రోజుల కార్యక్రమంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వీబీజీ రామ్‌జీతో అనుసంధానం చేసి పనులు చేపట్టాలన్నారు. 2027 ఏప్రిల్ 1 నుంచి మూడో దశ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలను మూడు మీటర్లకు పైగా పెంచే లక్ష్యంతో చర్యలు చేపట్టాలన్నారు. జలధార-జలహారతిని నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా స్థూల వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతాక్రమంలో చేపట్టే 36 ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి కాలువల నిర్వహణను మెరుగుపరచాలని, పూడిక తొలగించి చిట్ట చివరి ఎకరాకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లాకులు, షట్టర్లు, గేట్ల నిర్వహణను పటిష్ఠం చేయాలని సూచించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తత

బంగాళాఖాతంలో ఏర్పడే తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ రిజర్వాయర్లు, చెరువులను నింపాలని సూచించారు. వరద నిర్వహణ, నీటి నిర్వహణ, విపత్తుల నిర్వహణపై సమగ్ర కార్యాచరణ అమలు చేయాలన్నారు.

భూగర్భ జలాలు పెరిగేలా ముందస్తు చర్యలు చేపట్టి కరువును సమర్థంగా ఎదుర్కోవాలన్నా రు. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం, సాగునీటి వనరులను సమర్థంగా నిర్వహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారుల కు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# చంద్రబాబుతో పవన్ మరోసారి భేటీ




అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పలుచోట్ల ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలపై కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసానికి చేరుకున్న పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటు అంశంపై వీరిద్దరూ సుమారు అరగంట పాటు సుదీర్ఘంగా చర్చించారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ఆశావాహులు అవకాశం ఉన్నచోట్ల పోటీపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో కొన్నిచోట్ల గందరగోళ పరిస్థితి నెలకొంది. పోటీ ఉన్న స్థానాల్లో తిరుగు బాట్లను నివారించి, కూటమి అభ్యర్థుల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. ఇదిలా ఉండగా గురువారం కూడా పవన్ కళ్యాణ్ సీఎంతో సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన విషయం తెలిసిందే.

నామినేషన్ల చివరి రోజు కావడం, పలుచోట్ల ఫ్రెండ్లీ ఫైట్ వాతావరణం కనిపిస్తుండటంతో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## నూజివీడు టీడీపీలోకి వైసీపీ నుండి భారీగా వలసలు...

# ఆందోళనలో తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు




జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రమంతా రప్పా రప్పాలాడిస్తాం, నెత్తుటేర్లు పారిస్తాం అంటూ నడిరోడ్డు మీద వైసీపీ అల్లరిమూకలు, రౌడీలు, గూండాలు రోజు రోజుకూ పేట్రేగిపోతున్నారు. వైసీపీ కండువాలు వేసుకున్న టెర్రరిస్టుల్లా వైసీపీ నేతలు, కార్యకర్తలు రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు, కూటమి బలపర్చిన అభ్యర్థులపై పైశాచిక దాడులు చేస్తూ నరమేధాన్ని సృష్టిస్తూ రాష్ట్రంలో భయకంపిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. లా అండ్ ఆర్డర్ ను కాపాడుతున్న పోలీసులపై కూడా వైసీపీ రౌడీలు పిడిగుద్దుల వర్షం కురిపించడంతో పాటు, భవిష్యత్తులో జగన్ సీఎం అయిన తర్వాత.. చనిపోయినపోయిన వారిని సైతం వదలకుండా శ్మశానాల్లోకి వచ్చి మరీ లేపుతామంటూ బెదిరింపుల పర్వానికి తెరలేపుతున్నారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా నామినేషన్లు వేసి గెలిచిన కూటమి అభ్యర్థులను జగన్ సీఎం అయిన వెంటనే మెట్టు(చెప్పు)తో కొట్టి రాజీనామాలు చేయిస్తామని ఎన్నికలు జరగకముందే బహిరంగ సవాళ్లు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

**నూజివీడు టీడీపీలో భారీగా చేరికలు**

రాష్ట్రవ్యాప్తంగా నేడు ఇలాంటి పరిస్థితులుంటే... నూజివీడులో మాత్రం వైసీపీలో కీలకపాత్ర పోషించే నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు పోటీపడుతున్నారు. కేవలం రెండు వారాల్లోనే దాదాపు వెయ్యి కుటుంబాలు నూజివీడు నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ కండువా కప్పుకోవడంతో నూజివీడు దివాణం గోడలు బీటలువారుతున్నాయి. దివాణంలోని దొరగారు నేను లేస్తే మంచోడిని కాదు, నేను రౌడీలకు రౌడీని, గూండాలకు గూండాని అని రోడ్ల మీద దువ్వెనతో మీసాలు తిప్పడానికి పరిమితం కావడంతో.....వైసీపీ నేతలు, కార్యకర్తలు ఒకింత అసహనం, అభద్రతాభావంలోకి నెట్టబడ్డారు. ఈ నేపథ్యంలో నూజివీడులో గత రెండున్నరేళ్లలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంతో నూజివీడు నియోజకవర్గ ప్రజల్లో కూటమి ప్రభుత్వం పట్ల అభిమానం, గౌరవం, నమ్మకం ఊహించనిస్థాయిలో పెరిగాయి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సమస్యలను సైతం కేవలం రెండున్నరేళ్లలోనే కూటమి ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేయడంతో అభివృద్ధి, సంక్షేమానికి విజనరీ లీడర్ చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని నూజివీడు ప్రజలు నిర్ధారించుకున్నారు.

**అభివృద్ధి, సంక్షేమం వెంటే నూజివీడు ప్రజలు**

రప్పా రప్పా, జగనన్న 2.0 వంటి స్లోగన్లు, సొల్లుకబుర్లతో నూజివీడు నియోజకవర్గానికి ఒరిగేది ఏమీ లేదని నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వైసీపీ నేతలు, కార్యకర్తల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లడం, స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో మంత్రి కొలుసు పార్థసారధితో టీడీపీ కండువా కప్పించుకుని టీడీపీ బలోపేతం దిశగా పనిచేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, నూజివీడు రూరల్, నూజివీడు మున్సిపాలిటీల్లో స్థానిక సంస్థల నగారా మోగిన నాటి నుండి నేటి వరకు సుమారు 1,000 మంది తెలుగుదేశం జెండా కప్పుకోవడంతో నూజివీడు వైసీపీ నేతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటి వరకు ఆగిరిపల్లి మండలంలోని నరసింగపాలెం, అడవినెక్కలం గ్రామాలు, ముసునూరు మండలం నుండి రమణక్కపేట గ్రామం, చాట్రాయి మండలం నుండి పోతనపల్లి, నరసింహారావు పాలెం, చీపురుగూడెం, చిన్నంపేట, సోమవరం, చాట్రాయి గ్రామాలు, నూజివీడు టౌన్ లోని 9, 36వ వార్డులు, నూజివీడు రూరల్ మండలంలోని సుంకొల్లు రహీం తండా ఇలా నియోజకవర్గం నలుమూలల నుండి ఈ వెయ్యి కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వలసలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

**కిరాయి విమర్శకులను తెచ్చుకునే దుస్థితిలో దివాణం దొర**

మంత్రి కొలుసు పార్థసారధి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి, వ్యక్తిగత సహాయం వంటివాటిని చూస్తున్న నూజివీడు వైసీపీ నాయకులు, దివాణం దొర కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే శక్తిలేక... కిరాయి విమర్శకులను మచిలీపట్నం, గన్నవరం, వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి నాయకులను సైతం లక్షలు వెచ్చించి తీసుకొచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. ఏలూరుజిల్లాలోని నియోజకవర్గాల్లో నూజివీడు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోంది. మేం దొరలం, పాలకులం, గొప్ప గొప్ప నాయకులం అని దువ్వెనతో బహిరంగ సమావేశాల్లో రొయ్య మీసాలు దువ్వుకునే దొరలు తాము ఎమ్మెల్యేలుగా ఉన్న సమయంలో చేయలేని పనులను మంత్రి కొలుసు పార్థసారధి కేవలం రెండేళ్లలోనే చేసి చూపించేసరికి నూజివీడు ప్రజల దృష్టి కూటమి సర్కారు వైపు గణనీయంగా మళ్లింది. స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగేసరికి నూజివీడు పట్టణంలో ఊహించని రీతిలో వందలకోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. మరిన్ని పనులు జరుగుతూ ఉన్నాయి, మరో రూ.155కోట్ల రూపాయాలతో పనులు సిద్ధంగా ఉన్నాయి. దీంతో నూజివీడు ప్రజలంతా తమ బ్రతుకులు బాగుపడాలంటే నమ్మకోవాల్సింది దివాణం కోట గోడల మధ్య దాక్కునే దొరలను కాదు.....పెద్దపాలేరులా పనిచేస్తానని చెప్పి హామీ ఇచ్చి, గెలిచి, ఇచ్చిన మాట ప్రకారం నిరంతరం కష్టపడే మంత్రి కొలుసు పార్థసారధిలాంటి పనిమంతులను నిర్ధారించుకున్నారు.

**ఓటు అడగాలంటే భయపడుతున్న వైసీపీ అభ్యర్థులు**

నూజివీడు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎక్కడా, ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో అన్ని రాజకీయ పార్టీలు నామినేషన్లు దాఖలు చేశారు, ప్రచారంలో దూసుకుపోతున్నారు. కూటమి అభ్యర్థుల విజయం ఇక లాంఛనమే అని నూజివీడు పుర ప్రజలు గొంతెత్తి చెబుతున్నారు. దీంతో ఇంటింటి ప్రచారం చేయాలన్నా సరే...వైసీపీ అభ్యర్థులు ఒక అడుగు వెనక్కి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓట్లు అడగాలంటే...మీరు అధికారంలో ఉండగా మాకు ఏం చేశారని మీకు ఓట్లు వేయాలి? అని ప్రజలు నిలదీస్తారేమో అని వైసీపీ అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు.

**- మునీంద్ర కొడాలి**
**పొలిటికల్ ఎనలిస్ట్, సీనియర్ జర్నలిస్ట్**

*రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, కూటమి పార్టీల అభ్యర్థులపై పైశాచిక దాడులకు పాల్పడుతున్న వైసీపీ సైకోలతో పోలిస్తే.... నూజివీడు నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రం టీడీపీలోకి ఏక్షణం వెళ్లిపోతారో అనే అందోళనలో తాడేపల్లి పెద్దలు ఉన్నారు. దీంతో దివాణం దొర పరిస్థితి కూడా కుడితితొట్టిలో పడిన ఎలుక మాదిరి ఏర్పడడంతో నూజివీడు వైసీపీ నేతలు నిస్సహాయ స్థితిలోకి నెట్టబడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ*

### నేతలు, కార్యకర్తలను కాపాడుకునే పనిలో నూజివీడు వైసీపీ పెద్దలు

*ఓటమిని మూటకట్టుకుని రోడ్డుమీద తిరగడంకంటే, మంత్రి పార్థసారధిని కలిసి తెలుగుదేశం జెండా కప్పుకోవడం ఉత్తమం అనే ఆలోచనలో నూజివీడు వైసీపీ నేతలు ఉన్నారు. మంత్రి పార్థసారధి, తన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం చేసే ప్రాంతాల్లోని వైసీపీ కార్యకర్తలు, నాయకులను ఆ పార్టీ నాయకులు కాపాడుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు.*

- మంత్రి పార్థసారధి



# ఎన్నికల్లో హింసకు పాల్పడితే ఊరుకోం

## ప్రేరేపించే నేతలపై కఠిన చర్యలు - డీజీపీ హరీష్‌కుమార్ హెచ్చరిక

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్ కుమార్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల్లో చట్టబద్ధంగా పాల్గొనే ప్రతి అభ్యర్థి, ఓటరు హక్కుకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మూక హింసకు పాల్పడినా, అభ్యర్థులను బెదిరించినా, చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.

ఈ మేరకు డీజీపీ కార్యాలయం శుక్రవారం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో చోటుచేసుకున్న 14 ఘర్షణ ఘటనలపై కేసులు నమోదు చేసినట్టు డీజీపీ తెలిపారు. ఇందులో పల్నాడు, కడప జిల్లాల్లో అత్యధికంగా మూడు చొప్పున ఘర్షణలు జరగ్గా, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో రెండు చొప్పున, తిరుపతి, కర్నూలు, అన్నమయ్య, మార్కాపురం జిల్లాల్లో ఒక్కో ఘటన నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఇప్పటివరకు 17 మంది నిందితులను గుర్తించినట్టు వివరించారు. 'రాజకీయ పలుకుబడి ఉన్నంత మాత్రాన చట్టం నుంచి ఎవరికీ రక్షణ ఉండదు. ఘటనాస్థలిలో నేరుగా లేకపోయినా.. వెనకుండి హింసను ప్రేరేపించే రాజకీయ నేతలపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని డీజీపీ హెచ్చరించారు. నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు సురక్షితంగా చేరుకునేలా పోలీసు యంత్రాంగం రక్షణ కల్పిస్తుందన్నారు. అల్లరిమూకలను గుర్తించేందుకు సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ పుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపడుతున్నామని, దీనివల్ల పోటీ చేసే అభ్యర్థుల అర్హతకు ఎలాంటి భంగం కలగదని స్పష్టం చేశారు. ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులకు లోబడే జరగాలని ఆదేశించారు. 'పోలీసుల సంయమనాన్ని బలహీనతగా భావించవద్దు.. ఎన్నికలను నిష్పాక్షికంగా, అత్యంత కఠినంగా నిర్వహిస్తాం" అని డీజీపీ తేల్చి చెప్పారు.



## కంసమామ: కుటుంబ బంధాలపై

# గొడ్డలి వేటు




- జగన్ మోహన్‌రెడ్డి అభినవ కంసుడు. ఇలాంటి అన్నయ్య ఏ చెల్లెలికి ఉండకూడదని నాడే షర్మిళ చెప్పింది.
- నాడు షర్మిళ చెప్పిన దాన్ని జగన్ మోహన్‌రెడ్డి అక్షరాలా నిజం చేసి చూపిస్తున్నాడు.
- ప్రజాస్వామ్య విధ్వంసమే కాదు... అనుబంధాల విధ్వంసంలో కూడా జగనే బ్రాండ్ అంబాసిడర్.
- తన లాభం కోసం కుటుంబ బంధాల మీద కూడా గొడ్డలి వేటు వేసేంత కర్కోటకుడు.
- తల్లి-చెల్లి, బాబాయ్-చిన్నమ్మ అనే అనుబంధాలనేవి జగన్ మోహన్ రెడ్డికి ఉండవు.
- తల్లి-చెల్లికి ఇవ్వాల్సిన ఆస్తిని ఇవ్వకుండా కోర్టుకెళ్లిన జగన్... ఇప్పుడు అంతకు మించిన దారుణానికి దిగాడు.
- షర్మిళ కుమార్తె... సొంత మేనకొడలు పెళ్లిని బెంగళూరు యలహంక ప్యాలెస్సులో చేసుకోకుండా అడ్డుపడ్డారు.
- యలహంక ప్యాలెస్ జగన్ మోహన్ రెడ్డి కూడబెట్టుకున్న ఆస్తి కాదు.. పిత్రార్జితం. షర్మిళకూ వాటా ఉంది.
- ఆ ప్యాలెస్సులో తనకున్న వాటాలో పెళ్లి చేసుకోవాలని షర్మిళ ఏర్పాట్లు చేసుకుంటే... పెళ్లి చేయడానికి వీల్లేదన్నాడు.
- తన కుమార్తె పెళ్లి ఎక్కడ చేసుకోవాలో తెలియక... బెంగళూరు వీధుల్లో వెతుక్కోవాల్సిన పరిస్థితిని షర్మిళకు కల్పించాడు.
- శుభకార్యక్రమం జరిగితే ఎవ్వరైనా సహకరిస్తారు.. సహకరించడం చేతకాకుంటే సైలెంటుగా ఉంటారు.
- కానీ జగన్ మోహన్ రెడ్డిది క్రూరమైన మనస్తత్వం. తనతో విబేధించిన షర్మిళ ఇంట్లో శుభకార్యాన్ని అడ్డుకుంటున్నాడు.
- మేనమామ కంసమామగా తయారయ్యాడు..ఆ ఆడబిడ్డ మానసిక క్షోభకు జగన్ సమాధానం చెప్పగలడా..?
- పైగా యలహంక ప్యాలెస్సులో షర్మిళ కుమార్తె పెళ్లి జరిగితే తన భద్రతకు భంగంవాటిల్లుతుందని చెబుతున్నాడు.
- ఇలాంటి మనస్తత్వం ఉన్న జగన్ గురించి ప్రతి మహిళా ఆలోచించాలి.
- అభివృద్ధిని అడ్డుకున్నాడు... హింసను ప్రోత్సహించాడు-బంధాలను విచ్ఛిన్నం చేశాడు. తల్లి-చెల్లిని మోసం చేశాడు.
- సొంత బాబాయి వైఎస్ వివేకాను మరో తమ్ముడు వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి హత్య చేయించాడు.
- వైఎస్ వివేకా హత్యపై నాడు జగన్ మోహన్‌రెడ్డి దొంగఏడుపులు ఏడ్చాడు... సీబీఐతో విచారణ చేయించాలన్నాడు.
- అధికారంలోకి వచ్చాక అడ్డం తిరిగాడు. సీబీఐ విచారణ అవసరం లేదని అన్నాడు.
- ఇదేం దారుణం... సీబీఐ విచారణ జరగాల్సిందేనని వివేకా కుమార్తె చెబితే... ఆమే చంపిందని నీచంగా మాట్లాడాడు.
- వైఎస్ వివేకా హత్యలో అంతిమ లబ్ధిదారు జగన్.. ఆయన భార్యేనని దస్తగిరి, సునీల్ అనే వాళ్లు చెప్పారు.
- పులివెందుల ప్రజలు అభివృద్ధి కాముకులు. బాగాకష్టపడేవారు. తెలివైనవాళ్లు.
- జగన్‌వల్లే పులివెందుల అభివృద్ధిని అడ్డుకుంటున్నాడు. ఇలాంటినాయకుడు ఉండడం పులివెందుల ప్రజలకే అప్రతిష్ఠ.
- జగన్ సీఎం అయ్యాక రాష్ట్రాభివృద్ధిని అడ్డుకున్నాడు. రాష్ట్రం పరువు పోయేలా చేశాడు.
- జగన్ లాంటి ఆలోచన ఉన్న వాళ్లని రాజకీయాలకే కాదు.. సమాజానికి దూరంగా ఉంచాలి.




- దేశంలో 25% పెట్టుబడులు ఏపీకే.
- చంద్రన్న బ్రాండ్ ఇమేజ్, లోకేష్ కృషితోనే పెట్టుబడుల వరద.
- గూగుల్, అర్సెల్లార్ మిట్టల్, రిలయన్స్, కాగ్నిజెంట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, AMCA ఫైటర్ జెట్, క్యారియర్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలకు రెడ్ కార్పెట్.
- యువగళం హామీ మేరకు మొదటి ఏడాదే 16 వేల ఉపాధ్యాయుల నియామకం, 6 వేల కానిస్టేబుళ్లతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30 వేల భర్తీ – మరో 10 వేల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల.
- ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 22 SIPB సమావేశాలు నిర్వహించింది.
- ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా 2030 నాటికి స్వయంఉపాధి, ఉద్యోగాల కల్పనను పెంచేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
- రూ.500 కోట్ల ప్రత్యేకనిధి, రూ.75 లక్షల వరకు మార్జిన్‌మనీ సబ్సిడీ, 175 నియోజకవర్గాల్లో MSME పార్కుల ఏర్పాటు ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో MSME పార్కు ఏర్పాటు లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది.
- 2026 సెప్టెంబర్ నాటికి 19 పార్కులు ప్రారంభించగా, 138 పార్కుల్లో పనులు ప్రారంభమయ్యాయి. 2,876 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యూనిట్లు కార్యకలాపాలు ప్రారంభించాయి.
- కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాల వారీగా జాబ్‌మేళాలు నిర్వహించి ప్రైవేట్ కంపెనీల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. జూన్ 2024 నుంచి 1,587 జాబ్‌మేళాలు నిర్వహించి, 1,08,747 మందికి ఉపాధి కల్పించాం.



- APSSDC, ITIలు, PMKVY, Naipunyam పోర్టల్ ద్వారా యువత నైపుణ్యాలు, శిక్షణ, ఉద్యోగ ఖాళీలను అనుసంధానించి ఉద్యోగసాధనకు సహకారం అందజేస్తున్నాం.
- APSSDC, PMKVY: కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి పథకం కింద జూన్ 2026 వరకుఏపీలో 5,76,969 మంది శిక్షణ పొందారు.
- Naipunyam పోర్టల్: ఫిబ్రవరి 2026 ప్రజెంటేషన్‌లో 77,469 మంది స్కిల్ ట్రైనింగ్ పొందారు
- 2026 అక్టోబర్ 2 నాటి నివేదిక ప్రకారం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా 5.43లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి.




## నామినేషన్లు, ఏకగ్రీవాలపై బయటపడుతున్న వైసీపీ ఫేక్ ప్రచారం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో హోరాహోరీగా దాఖలవుతున్న నామినేషన్లు.
- టీడీపీ కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేసిన వైసీపీ.
- 28 జిల్లాల్లో 9829 ఎంపీటీసీలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలు.
- మొత్తం 15,017 నామినేషన్లు వేసిన టీడీపీ అభ్యర్థులు.
- ఇప్పటికి 12,419నామినేషన్లు దాఖలు చేసిన వైఎస్ఆర్సీపీ అభ్యర్థులు.
- జనసేన పార్టీ తరపున 2073 మంది నామినేషన్ల దాఖలు.
- బీజేపీ నుంచి 562 నామినేషన్లు దాఖలయ్యాయి.
- 28 జిల్లాల్లో 659 జెడ్పీటీసీ స్థానాలకు గానూ మొత్తం 2805 నామినేషన్లు దాఖలు అయ్యాయి.
- వైఎస్ఆర్ సీపీ నుంచి 1092 మంది నామినేషన్లు వేశారు.
- తెలుగుదేశం పార్టీ తరపున 1055 నామినేషన్లు దాఖలయ్యాయి.
- జనసేన పార్టీ నుంచి 178, బీజేపీ తరపున 111 నామినేషన్లు దాఖలు.
- 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా ఏకగ్రీవాలు.



- నాడు జరిగిన పట్టణ స్థానిక సంస్థల్లో 20.72 శాతం ఏకగ్రీవాలు చేసుకున్న వైసీపీ.
- వైసీపీ పాలనలో జరిగిన గ్రామీణ స్థానిక సంస్థల్లో 24 శాతం మేర ఎంపీటీసీ స్థానాలు, 19 శాతం మేర జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా బలవంతంగా చేజిక్కించుకున్న వైసీపీ.
- విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి ఏకగ్రీవం చేసుకుని విజయం సాధించామని నాడు వైసీపీ ప్రకటన.

# స్థానిక ఎన్నికలను అడ్డుకోవటమే జగన్ అసలు అజెండా

- 16వ ఆర్థికసంఘం నిధులు రాకుండా చేసి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కల్పించే పన్నాగం
- కోర్టుల్లో 59 కేసులు వేయించి క్రిమినల్ లిటిగెంట్‌గా వ్యవహరిస్తున్న జగన్
- నామినేషన్లు వేయనీయటం లేదంటూ దొంగ ఏడుపులు
- లెక్కలు తీస్తే వైసీపీ వారి నామినేషన్లే అధికం, వెబ్‌సైట్‌లో అందరికీ కనిపిస్తున్న వాస్తవం
- నాడు 2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవం చేసుకున్న జగన్
- సొంత బాబాయిని చంపి నారాసుర రక్తచరిత్ర అంటూ రాయించిన నీచ చరిత్ర జగన్‌ది
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు
- 2024లో పతనం మొదలైంది... ఇక వైసీపీ భూస్థాపితం ఖాయం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు




అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు నుంచే అడ్డుకునేందుకు వైసీపీ అనేక కుట్రలు పన్నుతోందని, తద్వారా రాష్ట్రాభివృద్ధికి విఘాతం కల్పించాలన్నదే గొడ్డలిపార్టీ పన్నాగమని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా 16వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా స్థానిక సంస్థలకు రావాల్సిన దాదాపు 12,500 వేల కోట్ల రూపాయల నిధులు రాకుండా చేయడమే జగన్‌మోహన్ రెడ్డి అజెండా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే కోర్టుల ద్వారా, నామినేషన్ మొదటి రోజు నుంచే అరాచకాల ద్వారా ఎన్నికల ప్రక్రియను భంగపరచడానికి ప్రయత్నిస్తున్నారు. పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి, తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగరిలో రోజా రెడ్డి, కాళహస్తి, రాయచోటి, ఆదోని, కనిగిరి తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు బరితెగించి టీడీపీ వారి కార్లు తగలబెట్టడం, కార్లతో గుద్దించడం, నామినేషన్ పత్రాలు చింపేయడం, కర్రలు, గొడ్డళ్లు, రాళ్లు, మందు సీసాలతో దాడులు చేయడంతో పాటు, పోలీసులపై కూడా దాడులకు దిగి వంటి అరాచకాలకు పాల్పడ్డారు. వీటన్నింటికీ వీడియోలతో సహా సాక్ష్యాలు ఉన్నాయి. ఇలాంటి దౌర్జన్యాలు చేసిన వారు నంద్యాలలో ఒక అభ్యర్థి విత్‌డ్రా చేసుకుంటే దానిని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బొండా తప్పుబట్టారు.

### అన్నీ అబద్ధాలే..

జగన్‌మోహన్ రెడ్డి తాజాగా ప్రెస్‌మీట్‌లో చెప్పినవన్నీ అబద్ధాలే. దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఆయన చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి గొడ్డలి పార్టీ 59 కేసులు పెట్టింది. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. 2014లో చంద్రబాబు నాయుడు హయాంలో మున్సిపల్ ఎన్నికల్లో కేవలం 1 శాతం ఏకగ్రీవాలు జరిగాయి. అయితే 2021లో జగన్ హయాంలో రౌడీజం, హత్యాయత్నాలు, బెదిరింపులు, బలవంతపు విత్‌డ్రాలు, కిడ్నాపులు చేసి 24 శాతం ఏకగ్రీవాలు చేసుకున్నారు. పంచాయితీలయితే చెప్పే పనిలేదు. పుంగనూరులో 85కి 84, మాచర్లలో 77కి 74, పూతలపట్టులో 52కి 46, కాళహస్తిలో 121కి 71, పులివెందులలో 180కి 90 వంటి బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయి. ఇవన్నీ రికార్డుల్లో ఉన్నాయని ఎమ్మెల్యే బొండా తెలిపారు.

### నామినేషన్లపై దొంగమాటలు

అవినీతికి, విధ్వంసానికి, అప్రజాస్వామ్యానికి జగన్‌మోహన్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్. ఆయన తండ్రి హయాంలోనే లక్షల కోట్లు దోచుకొని సీబీఐ కేసుల్లో జైలు శిక్ష అనుభవించిన వ్యక్తి. సొంత బాబాయి వివేకానంద రెడ్డిని హత్య చేయించి నారాసుర రక్తచరిత్ర అంటూ సొంత మీడియాలో రాయించిన నీచ చరిత్ర ఆయనది. 85 శాతం హామీలను ఎగ్గొట్టిన వ్యక్తి జగన్. అయినా 100 శాతం హామీలు నెరవేర్చామని అబద్ధాలాడుతున్నారు. కూటమి ప్రభుత్వం 27 నెలల్లో ఆర్థిక సంక్షోభంలో కూడా 1,60,000 కోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టింది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. ప్రజల ఆశీస్సులు కూటమి ప్రభుత్వానికి ఉన్నాయి. అందుకే ధైర్యంగా ఎన్నికలకు వెళ్తున్నాం. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ వేయనీయలేదని జగన్‌మోహన్ రెడ్డి చెబుతున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే – 659 జెడ్పీటీసీలకు వైసీపీ 1092 నామినేషన్లు, 9829 ఎంపీటీసీలకు 12,419 నామినేషన్లు దాఖలు చేసింది. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఇవి అందరికీ కనిపిస్తున్నాయి. అయినా అవాస్తవాలు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్‌మోహన్ రెడ్డి ఇలా ప్రవర్తిస్తున్నారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారు. 2024లోనే వైసీపీ పతనం మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగితే వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం. కూటమి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు, పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తోంది. కెమెరాలు, సీసీ టీవీలు ఉన్నాయి. ఎక్కడా అవకతవకలకు తావు లేదు. జగన్‌మోహన్ రెడ్డి అవాస్తవాలు చెప్పడం మానుకోవాలి. ప్రజలు మీ గత చరిత్రను మరిచిపోలేదని ఎమ్మెల్యే బొండా స్పష్టం చేశారు.

# వైసీపీ మూకల వ్యవస్థీకృత హింస

## స్థానిక ఎన్నికలను అడ్డుకోవటమే వారి అజెండా - చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఫిర్యాదు



అమరావతి (చైతన్యరథం): స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ మూకలు సృష్టిస్తున్న హింసాకాండపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)కి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. ఎస్ఈసీకి శుక్రవారం వర్ల రామయ్య చేసిన ఫిర్యాదు పూర్తి పాఠం:

**గౌరవనీయులైన సార్,**

**విషయం:** స్థానిక సంస్థల ఎన్నికలు–2026 – వైసీపీ కొనసాగిస్తున్న వ్యవస్థీకృత హింస – స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను భగ్నం చేసేందుకు కుట్ర – నామినేషన్లపై వైసీపీ తప్పుడు ప్రచారం – వైసీపీపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థన.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను భగ్నం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ గూండాలు హింసాత్మక చర్యలను కొనసాగిస్తుండటం అత్యంత దిగ్భ్రాంతికరం. మరోవైపు, తామే ప్రేరేపించిన హింసకు తామే బాధితులమన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనకుండా ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనే ఉద్దేశంతో వైసీపీ మూకలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై, సాధారణ ప్రజలపై ప్రతిరోజూ వరుసగా హింసాత్మక దాడులకు పాల్పడుతున్నాయి.

వైసీపీ పథకం ప్రకారం నిర్వహించిన కొన్ని హింసాత్మక ఘటనలను మీ పరిశీలన కోసం కింద తెలియజేస్తున్నాము.

1. అక్టోబర్ 21న పుంగనూరు రూరల్ మండలానికి సంబంధించిన ఎంపీటీసీ నామినేషన్ కేంద్రం వద్ద తెలుగుదేశం పార్టీ కార్యకర్త శివానందపై వైసీపీ గూండాలు దాడి చేశారు. ఈ దాడిలో శివానంద తీవ్రంగా గాయపడటంతో ఆయనను ఆసుపత్రిలోని అత్యవసర చికిత్స విభాగంలో చేర్పించారు.
2. అక్టోబర్ 23న మార్కాపురం జిల్లా యర్రగొండపాలెంలో ఎంపీటీసీ నామినేషన్ల దాఖలు సందర్భంగా వైసీపీ గూండాలు విధ్వంసం సృష్టించారు. నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని, నామినేషన్ల ప్రక్రియకు పోలీసులు సహకరిస్తారని వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పోలీసులు పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, వారు రహదారిపై ధర్నాకు దిగి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. రహదారిపై బూటకపు నిరసన చేపట్టిన వైసీపీ గూండాలు అటుగా వెళ్తున్న వాహనాలపై దాడులకు పాల్పడి, వాహనాల అద్దాలను ధ్వంసం చేసి, సాధారణ ప్రజల్లో భయాందోళనలు సృష్టించారు.
3. తిరుపతిలో వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన దౌర్జన్యాలపై కేసు నమోదు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ నిరసన జరుగుతున్న సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన గూండాలతో కలిసి అక్కడికి చేరుకుని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వైసీపీతో సహా అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తున్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియను, ముఖ్యంగా నామినేషన్ల దాఖలు ప్రక్రియను లక్ష్యంగా చేసుకుని వైసీపీ దుష్ప్రచారం కొనసాగించడం బాధాకరం.

ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను కలుషితం చేస్తూ, ఓటర్లలో భయాందోళనలు సృష్టిస్తున్న వైసీపీపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. అదేవిధంగా, వైసీపీ గూండాలు, వారి అనుచరులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుని, ఎన్నికలు స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన వాతావరణంలో జరిగేలా చూడటం అత్యంత అవసరం.

వైసీపీ వ్యవస్థీకృత హింసను చూపించే ఛాయాచిత్రాలు, యర్రగొండపాలెంలో వైసీపీ గూండాల హింసాత్మక దాడికి సంబంధించిన ఫొటోలు ఈ ఫిర్యాదుతో జత చేశాము.

**ధన్యవాదాలు.**

**టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ**
**వర్ల రామయ్య**

చైతన్యరథం

# వైసీపీ అరాచక మూకలపై చర్యలు తీసుకోవాలి

- స్థానిక ఎన్నికల్లో బరితెగించి దౌర్జన్యాలు, విధ్వంసాలు
- మాచర్లలో 300 మందితో పిన్నెల్లి సోదరుడి వీరంగం.. పోలీసులపై దాడులతో స్వైరవిహారం
- సుప్రీంకోర్టు తీర్పుపై జగన్‌కు కనీస అవగాహన లేదు
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను పక్కాగా అమలు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- మీడియాతో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య
- జగన్ తన వాదన నెగ్గించుకోవడానికి ఇక పాకిస్తాన్‌కో, ట్రంప్ దగ్గరికో పోవాలని ఎద్దేవా
- 8 ప్రాంతాల్లో వైసీపీ సృష్టించిన హింసాత్మక ఘటనలపై ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నేతలు
- టీడీపీ బృందంలో పర్చూరి అశోక్ బాబు, ఎస్. రాజశేఖర్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్



అమరావతి (చైతన్యరథం): అరాచశక్తుల ముఠా మాదిరిగా వ్యవహరిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుపై కనీస అవగాహన లేకుండా గొడ్డలిపార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో వైసీపీ నాయకులు సాగించిన దౌర్జన్యాలు, అరాచకలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. హనుమంతునిపాడు, కృష్ణగిరి, కురవపల్లి, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, యడ్లపాడు, చౌడేపల్లి, ధర్మవరం, మాచర్ల ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు సాగించిన దాడులు, విధ్వంసాలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ లతో కూడిన బృందం ఎన్నికల కమిషనర్‌కు సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. టీడీపీ అభ్యర్థులు, పోలీసులపై వైసీపీ గూండాలు సాగించిన దౌర్జన్యాలు, బెదిరింపులు, వాహనాల ధ్వంసానికి సంబంధించిన స్పష్టమైన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఎన్నికల కమిషనర్‌కు సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పటిలాగే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున కుట్ర పన్నిందన్నారు. ఎన్నికలు జరగకుండా నిలిపివేయాలనే దురుద్దేశంతో తప్పుడు పిటిషన్లు, దొంగ సాక్ష్యాలు సృష్టించి హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టు సింగిల్ బెంచ్‌ను ఆశ్రయించినా వారికి చుక్కెదురైంది. ఆ తర్వాత సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తే, న్యాయస్థానం వారి అభ్యర్థనను పాక్షికంగా మాత్రమే పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

వైసీపీ ఇచ్చిన 19 ఫిర్యాదులపై 'కేస్ బై కేస్' పరిశీలించి నిర్ణయం తీసుకునే పూర్తి అధికారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికే అప్పగించింది తప్ప జగన్‌కో, ఇంకోరికో అధికారం ఇవ్వలేదని విమర్శించారు.

## జగన్‌కు కనీస అవగాహన లేదు

రాష్ట్రానికి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై కనీస అవగాహన కూడా లేదని ఎమ్మెల్సీ వర్ల రామయ్య వ్యంగ్యబాణాలు సంధించారు. వైసీపీ తీరుపై, జగన్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు అసలేం తీర్పు ఇచ్చిందో పక్కనున్న నాయకులు కూడా జగన్‌కు చెప్పకపోవడం విడ్డూరం. తాజాగా మీడియా ముందుకు వచ్చి గంటా నలభై ఐదు నిమిషాల పాటు అంతా సొంత పురాణం మాట్లాడారే తప్ప, ప్రజలకు గానీ, ఎన్నికల ప్రక్రియకు గానీ ఉపయోగపడే ఒక్క మాటా జగన్ నోటి వెంట రాలేదు. 19 చోట్లా తీర్పు ఆయనకే అనుకూలంగా వచ్చినట్లు జగన్ భ్రమపడుతున్నట్లుగా ఉందని వర్ల రామయ్య ఎద్దేవా చేశారు.

## సుప్రీం మార్గదర్శకాలు పక్కాగా అమలు

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత బాధ్యతాయుతంగా అమలు చేసింది. కోర్టు 19 కేసుల ప్రస్తావన తెస్తే, ఎన్నికల సంఘం పారదర్శకత కోసం వందకు పైగా ప్రాంతాల్లో ప్రక్రియను నిలిపివేసి, 28 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు తెప్పించుకుంది. వాటన్నింటినీ నిశితంగా పరిశీలించాకే, కేవలం నాలుగు చోట్ల మాత్రమే తిరిగి నామినేషన్ల స్వీకరణకు ఆదేశాలిచ్చింది. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు.

## మాచర్లలో రౌడీ రాజ్యం..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి రెండు రోజులుగా వైఎస్సార్‌సీపీ గూండాలు సాగించిన హింసాకాండపై వీడియోలు, పత్రికా ఆధారాలతో సహా పక్కా సాక్ష్యాలు సమర్పించాం. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు 300 మందిని వెంటేసుకుని రోడ్లపై స్వైరవిహారం చేశారు. పోలీసులను నెట్టేయడం, బారికేడ్లను ధ్వంసం చేయడం, కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడులు చేసి బైకులను తగలబెట్టడం దారుణం. చివరకు విధుల్లో ఉన్న సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులను కూడా కిందపడేసి కొట్టే దౌర్భాగ్యపు పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు.

## వైసీపీ గుర్తింపును రద్దు చేయాలి

వైసీపీ అసలు రాజకీయ పార్టీయే కాదు, అదొక రౌడీల ముఠా, చంబల్ లోయ బందిపోట్ల గుంపు. ఇలాంటి అరాచక శక్తుల పార్టీ గుర్తింపును కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే రద్దు చేయాలి. పోలీసులు ఏమాత్రం భయపడకుండా బాధ్యులపై ముందస్తు అరెస్టులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరాం.

## జగన్ ఇక పాకిస్తాన్‌కో, ట్రంప్ దగ్గరికో పోవాలి

జగన్మోహన్ రెడ్డి.. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు, ఇక ఈ దేశంలో అంతకంటే పైకోర్టు లేదు. మీ వాదన నెగ్గించుకోవడానికి ఇక ట్రంప్ దగ్గరికో లేక పాకిస్తాన్‌కో వెళ్లాల్సిందే తప్ప మరో దారి లేదు. కండబలం, ధనబలంతో వ్యవస్థలను, ఎన్నికలను ఆపాలని చూస్తే చట్టం చూస్తూ ఊరుకోదు, తొక్కి నార తీస్తుంది. ఇప్పటికైనా మీ రౌడీ పద్ధతులు మానుకుని, రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయం చేయాలని వర్ల రామయ్య హితవు పలికారు.

# మచిలీపట్నం 60 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేయాలి

- విభేధాలకు తావులేకుండా పని చేయాలి
- చేసిన మంచిని, అభివృద్ధిని ప్రతి గడపకూ చేరుద్దాం
- సమన్వయంతో బందరు గడ్డపై కూటమి జెండా ఎగరేద్దాం
- కూటమి అభ్యర్థుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం (చైతన్యరథం): చారిత్రక మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు పని చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు ఇచ్చారు. మచిలీపట్నంలోని వేడుక ఫంక్షన్ హాల్‌లో కూటమి బలపరిచిన అభ్యర్థుల పరిచయ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, మచిలీపట్నం మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ సుదీర్ఘ చర్చలు, సమన్వయం అనంతరం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా అబ్దుల్ అబీదా ని కూటమి తరపున అధికారికంగా ప్రకటించామన్నారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సంయుక్తంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. స్థానికంగా ఉన్న 60 డివిజన్ల నాయకులను, కూటమి భాగస్వామ్య పక్షాలను సంప్రదించి ఏకగ్రీవంగా అబీదా పేరును ఖరారు చేశామని స్పష్టం చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం, హ్యామ్ ఫండ్స్ ద్వారా కార్పొరేషన్‌కు కోట్లాది రూపాయల నిధులను అదనంగా తీసుకువచ్చి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ప్రచారానికి కేవలం నాలుగున్నర రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున, నాయకులంతా ఏమాత్రం అలసత్వం వహించకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పెద్ద నగరాలతో పోలిస్తే తక్కువగా ఇక్కడ ఒక్కో డివిజన్ పరిధిలో 2000 నుండి 3000 వరకు మాత్రమే ఓట్లు ఉన్నందున ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లకు నమ్మకం కలిగించడం ముఖ్యమని, ఏ సమస్య వచ్చినా మేమున్నామనే ధైర్యాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి కల్పించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈ ఎన్నికల్లో కూటమిలోని మూడు పార్టీలు స్నేహపూర్వక వాతావరణంలో పోటీ చేస్తున్నాయి. డివిజన్ల వారీగా కూటమి తరపున ఏ పార్టీ అభ్యర్థి పోటీలో ఉన్నప్పటికీ మిగిలిన రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఇదే సమయంలో పార్టీల నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసినా, కోవర్టు రాజకీయాలకు పాల్పడినా వారిపై సీరియస్ చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ ఆదేశాలు ఉల్లంఘించే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 60 డివిజన్లకు గాను 60 స్థానాలనూ కైవసం చేసుకుని, ఈ విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలకు కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమష్టి కృషితో మచిలీపట్నం కార్పొరేషన్‌పై కూటమి జెండా ఎగురవేద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ఖాయం

- పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులు కరువు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- కొండపిలో అట్టహాసంగా కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు



కొండపి/ ప్రకాశం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ఖాయమని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు, పొన్నలూరు, మర్రిపూడి, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో కూటమి ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి డోలా మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కూటమి అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండున్నర ఏళ్లలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల ఆశీర్వదంతోనే నియోజకవర్గంలోని అన్ని స్థానిక సంస్థల స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు గొడ్డలి పార్టీకి కనీసం అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. ఓడిపోతామన్న భయంతోనే కొన్నిచోట్ల గొడ్డలి పార్టీ దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలతో మమేకమై పనిచేయాలని మంత్రి డోలా సూచించారు.

# జగన్ మేనమామ కాదు..

# మహిళల కన్నీళ్లకు కారణమైన కంసమామ

- తల్లి, చెల్లిని గెంటేసి, చివరికి మేనకోడలి పెళ్లిని సైతం అడ్డుకోవడం రాక్షసత్వం
- ఇంట్లో పెళ్లి జరిగితే అపరిచిత వ్యక్తులతో భద్రతకు ముప్పంటూ కుంటి సాకులు
- వైసీపీ నేత పేర్ని నాని వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని అక్క, చెల్లెమ్మలకు అండగా ఉంటా.. పిల్లలకు మేనమామలా ఉంటా అంటూ మైకుల ముందు ఊదరగొట్టే జగన్ రెడ్డి సొంత మేనకోడలి పట్ల మాత్రం కంసమామలా వ్యవహరిస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధ్వజమెత్తారు. నాయకత్వం అంటే మైకుల ముందు నిలబడి ఆర్భాటపు ప్రసంగాలు ఇవ్వడం, ప్రెస్ మీట్లలో గొప్పలు చెప్పుకోవడం కాదని స్పష్టం చేశారు. అధికారం, కుర్చీల కోసం కొట్లాడే రాజకీయ యుద్ధాలు నాయకత్వం అనిపించుకోవని, అత్యంత క్లిష్టమైన ప్రతికూల పరిస్థితుల్లో కూడా వ్యవస్థలను గౌరవిస్తూ, బాధ్యతతో వ్యవహరించి సరైన విధానంతో ముందుకు సాగడమే నిజమైన నాయకత్వ లక్షణమని ఆమె పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకపక్క రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ పనితీరును శంకిస్తూ మరోపక్క కేంద్ర బలగాలు రావాలని, స్ట్రాంగ్ రూమ్‌లు పెట్టాలని, తమ అభ్యర్థులకు విపరీతమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేయడం జగన్ అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. వ్యవస్థల మీద కనీస గౌరవం లేకుండా మాట్లాడే ఆయన, నేడు అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన సూచనలను సైతం తమ రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తున్నారు. సమయం చాలక లేదా ఇతర కారణాల వల్ల ఎవరైనా నామినేషన్లు వేయలేకపోయి ఉంటే వారికి అదనంగా మూడు రోజుల సమయం ఇస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ వెసులుబాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి ప్రతి రాజకీయ పార్టీకి సమానంగా వర్తిస్తుంది. కోర్టు ఇచ్చిన సాధారణ గడువును తమ పార్టీ కోసమే ప్రత్యేకంగా ఇచ్చినట్టు, తమ ఆరోపణలను కోర్టు ధ్రువీకరించినట్టు జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కేవలం తమ పార్టీ వాళ్లతో నామినేషన్లు వేయించలేదనే నెపంతో నిరాధార ఆరోపణలు చేసి, ఇప్పుడు 'ప్రజాస్వామ్యం గెలిచింది' అంటూ సంబరపడటం అత్యంత హాస్యాస్పదమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు.

### కనీస మానవత్వం లేని జగన్

నైతికత, ప్రజాస్వామ్యం గురించి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఒక నాయకుడి మాటల కంటే, ఆయన అనుసరించే విధానాలు, వ్యక్తిత్వమే ఆయన ఎలాంటి వాడో తెలియజేస్తాయని ఆమె అన్నారు. ఇంట్లో ఒక శుభకార్యం జరుగుతున్నప్పుడు శత్రువులైనా సరే పిలవడానికి వస్తే ఆహ్వానాన్ని గౌరవించి, ఆశీర్వదించి పంపడం మన తెలుగు సంస్కృతి, భారతీయ సాంప్రదాయం. కానీ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు, ఆయన వ్యవహార శైలి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. బయట సమాజంలో మహిళల ఆత్మగౌరవం, హక్కుల గురించి నీతులు చెప్పే జగన్.. తన సొంత చెల్లి, సొంత మేనకోడలి విషయంలో మాత్రం అత్యంత కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. ఆస్తిలో సమాన హక్కు ఉండాలని తండ్రి ఆశించినా, తన చెల్లి షర్మిల స్వయంగా ప్రతి గడప తొక్కి తన కూతురి పెళ్లి ఫలానా చోట జరుగుతుందని శుభలేఖలు పంచుతుంటే.. ఉమ్మడి ఆస్తి అయిన తన ఇంట్లో పెళ్లి జరగడానికి వీల్లేదని, తాను ఒప్పుకోనని కన్నతల్లితోనే జగన్ రాయబారాలు నడిపించడం ఎంతవరకు సమంజసం? ఎంతటి శత్రువైనా ఇంటికి వచ్చి శుభకార్యానికి ఆహ్వాన పత్రిక ఇస్తే దీవించడం మన సంస్కారం. కానీ సొంత మేనకోడలి శుభకార్యం విషయంలో జగన్ వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఆయన మనస్తత్వం ఏంటో స్పష్టమవుతోంది. సొంత చెల్లికి హక్కుగా రావాల్సిన ఆస్తిని ఇవ్వకుండా, ఆమె బిడ్డ పెళ్లి విషయంలో కూడా అడ్డంకులు సృష్టించే ఒక వ్యక్తి.. రాష్ట్రంలో ఉన్న అక్కచెల్లెమ్మలకు న్యాయం చేస్తారని నమ్మడం అమాయకత్వమే. ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ, సొంత కుటుంబానికే న్యాయం చేయలేని జగన్మోహన్ రెడ్డి.. బయటకొచ్చి ప్రజాస్వామ్యం, నైతిక విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు.

### మేనకోడలి పెళ్లికి ఆటంకాలు నీచం..

గతంలో జగన్ జైల్లో ఉన్నప్పుడు, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి, పార్టీని భుజాన మోసి ఆయన్ను రాజకీయంగా నిలబెట్టిన సొంత చెల్లెలు షర్మిలని, అలాగే అండగా నిలిచిన కన్నతల్లిని అధికారం రాగానే కాళ్లతో తన్ని పక్కన పడేశారు. అవసరం తీరిపోయాక వదిలేయడం ఒక ఎత్తైతే, ఏకంగా తీవ్రమైన ద్రోహానికి ఒడిగట్టడం జగన్ నైజమని మండిపడ్డారు. రాష్ట్రంలో పిల్లలందరికీ 'నేను మీ జగన్ మామను' అని చెప్పుకునే జగన్, సొంత మేనకోడలి పెళ్లికి ఆటంకాలు సృష్టించడం సిగ్గుచేటు. జగన్ వ్యవహారం మేనమామలా కాకుండా కంసమామలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రికి భార్యగా, మరొక మాజీ ముఖ్యమంత్రికి తల్లిగా గౌరవం పొందాల్సిన విజయమ్మ, నేడు సొంత కొడుకు పెట్టిన కష్టాలతో పరాయి ఇంట్లో తలదాచుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితిని జగన్ కల్పించారు. కన్నతల్లికే గూడు లేకుండా చేసి క్షోభకు గురిచేసిన వ్యక్తిత్వం ఆయనది. మహిళల ఆత్మగౌరవం కోసం, వారి ఆర్థిక స్వావలంబన కోసం ఆనాడే ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు పరిపాలించిన రాష్ట్రం ఇది. అలాంటి రాష్ట్రంలో సొంత చెల్లికి దక్కాల్సిన హక్కులను కాలరాస్తూ, మహిళా సాధికారత గురించి జగన్ ఉపన్యాసాలు ఇవ్వడం హాస్యాస్పదం. ఎదుటివారిపై నిరంతరం బురదజల్లుతూ, కక్షలు-కార్పణ్యాలతోనే రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని చూసే జగన్‌కు పరిపక్వత గానీ, సమన్వయ ఆలోచన గానీ లేవు. కేవలం కుర్చీ కోసం, అధికారం కోసం సొంత కుటుంబాన్నే రోడ్డుకీడ్చిన ఇలాంటి వ్యక్తి రాష్ట్రానికి నాయకుడిగా ఉండటానికి ఏమాత్రం అర్హుడు కాదని, ఆయన చర్యలు రాష్ట్రానికే చేటని గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

### వైసీపీ నేతల ఇంగితం లేని మాటలు

సొంత ఇంటి ఆడబిడ్డలకే గౌరవం ఇవ్వలేని జగన్మోహన్ రెడ్డిని సమర్థిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతున్న తీరు అత్యంత సిగ్గుచేటని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను, వైసీపీ తీరును ఆమె ఎండగట్టారు. గతంలో ఇదే జగన్మోహన్ రెడ్డి ఏకంగా తిరుమల సెట్టింగ్ వేయించుకుని ఇంట్లో పూజలు చేసుకున్నప్పుడు రాని సెక్యూరిటీ సమస్యలు, అపరిచిత వ్యక్తుల అంశం.. సొంత మేనకోడలి పెళ్లికి మాత్రమే గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. చెల్లెలికి బంధువులైన వారు జగన్‌కు కూడా బంధువులేనన్న కనీస ఇంగితాన్ని పేర్ని నాని మరిచిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలను కలవడానికి పరదాలు కట్టుకుని తిరిగిన మనస్తత్వం కాబట్టే, సొంతింట్లో జరిగే పెళ్లిని కూడా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. జగన్ అహంకారాన్ని, కంసమామ పోకడలను సమర్థిస్తూ మాట్లాడితే పేర్ని నానిని రేపు ఆయన సొంత కుటుంబ సభ్యులే అసహ్యించుకుంటారని హెచ్చరించారు. తప్పును తప్పుగా ప్రశ్నించే ధైర్యం లేకపోతే సొంత ఇంట్లోనే గౌరవం దక్కదని హితవు పలికారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నాలుగు కుటుంబాలను కలుపుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తుంటే, జగన్ మాత్రం ఉన్న కుటుంబాన్నే నాలుగు ముక్కలు చేస్తున్నారని విమర్శించారు. "విభజించు-పాలించు, బురదజల్లు-పైకెదుగు" అనే దుర్మార్గమైన ఆలోచనతో సాగే జగన్ వంటి వ్యక్తులను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని తేల్చిచెప్పారు. అందరినీ దూరం పెట్టి తానే గొప్ప అనుకునే వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. అమరావతి విషయంలోనూ ప్రజలను విభజించిన చరిత్ర ఆయనదని గుర్తుచేశారు. జగన్ మాట్లాడే మాటల్లో కేవలం ఓట్ల యావ, కుర్చీ పిచ్చి మాత్రమే కనిపిస్తుందని, మహిళల పట్ల ఆయనకు ఎలాంటి ప్రేమా, గౌరవమూ లేవని స్పష్టం చేశారు. ఒక కుటుంబంలో చిన్నపాటి విబేధాలు ఉన్నా పట్టువిడుపులు సహజం. కానీ, తనకు వత్తాసు పలకలేదన్న ఏకైక కారణంతో కన్నతల్లిని, తోబుట్టువును దూరం పెట్టి, చివరికి మేనకోడలి పెళ్లిని సైతం అడ్డుకోవడం అత్యంత నీచమైన చర్య. ఇది యావత్ రాష్ట్ర ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లుగా తయారైంది ఆ పార్టీ పరిస్థితి. అధినేత ఇంట్లోనే మహిళలకు రక్షణ, మర్యాద లేనప్పుడు కింది స్థాయి నాయకులు ఆడవారిని గౌరవిస్తారని ఎలా ఆశిస్తాం? కృష్ణా జిల్లాతో పాటు పలుచోట్ల వైసీపీ నాయకులు ఆడవారిని వేధిస్తున్నా ప్రోత్సహించడమే తప్ప జగన్ చర్యలు తీసుకోరు. మరీ దారుణంగా.. మహిళా నేత శ్యామల, మాజీ మంత్రి రోజా కూడా ఆడబిడ్డల గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనం. సొంత కుటుంబానికే రక్షణ, న్యాయం ఇవ్వలేని జగన్‌కు రాష్ట్రంలో 'మామ' అనిపించుకునే అర్హత గానీ, 'అన్న' అని పిలిపించుకునే నైతిక హక్కు గానీ లేవని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

# సౌదీ అరేబియా పరిస్థితులపై ఏపీఎన్ఆర్‌టీఎస్ నిరంతర పర్యవేక్షణ

*ప్రవాసాంధ్రుల భద్రత, సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత - గల్ఫ్‌లో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రావి రాధాకృష్ణ*

సౌదీ అరేబియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న ప్రవాసాంధ్రుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) కేంద్ర కార్యాలయం సంబంధిత వర్గాల ద్వారా సేకరిస్తూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సమీక్షిస్తోందని గల్ఫ్‌లో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రావి రాధాకృష్ణ తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు డాక్టర్ రవి కుమార్ వేమూరు, ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్(ఆపరేషన్స్, సర్వీసెస్) నాగేంద్ర బాబు అక్కిలి, తదితరులతో కలిసి సంబంధిత సమాచారాన్ని సమన్వయం చేస్తూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు.

అలాగే, ఏపీఎన్ఆర్‌టీఎస్ సౌదీ కోఆర్డినేటర్లు, రీజినల్ కోఆర్డినేటర్ జానీ షేక్, కోఆర్డినేటర్ రామకృష్ణ, ఇతర సంబంధిత ప్రతినిధుల ద్వారా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరిస్తూ, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. వివిధ సంబంధిత ప్రభుత్వ విభాగాలు, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ, ప్రవాసాంధ్రుల భద్రత, అత్యవసర సహాయం, బాధిత కుటుంబాలకు అవసరమైన సమాచారం అందించడం, పరిస్థితులకు అనుగుణంగా సహాయ చర్యలను సమన్వయం చేయడంపై ఏపీఎన్ఆర్‌టీఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏపీఎన్ఆర్‌టీఎస్ సౌదీ కోఆర్డినేటర్ల ద్వారా ప్రవాసాంధ్రులకు అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన సూచనలు, ధృవీకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు కృషి చేస్తోంది.

సౌదీ అరేబియాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు సంబంధిత అధికారుల సూచనలను పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారిక సమాచారాన్ని అనుసరించాలని, ధృవీకరించని వార్తలు, వదంతులను వ్యాప్తి చేయవద్దని ఏపీఎన్ఆర్‌టీఎస్ సూచిస్తోందని రావి రాధాకృష్ణ తెలిపారు.





# నెల్లూరు సిటీలో టీడీపీలోకి జోరుగా వలసలు

## - 54, 55 డివిజన్లలో వైసీపీకి బిగ్ షాక్.. సైకిలెక్కిన 50 కుటుంబాలు

నెల్లూరు (చైతన్యరథం): నగరపాలక సంస్థ ఎన్నికల వేళ నెల్లూరు సిటీలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. టీడీపీలోకి వలసలు కొనసాగుతుండటంతో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. తాజాగా 54, 55 డివిజన్లలో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మానికల సునీల్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంత్రి పొంగూరు నారాయణ, మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. డివిజన్లలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గ్రామ గ్రామాన అభివృద్ధి.. గడప గడపకు సంక్షేమం



- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం
- చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- కూటమి నేతలు, శ్రేణులకు మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపు

పాలకొల్లు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో పాలకొల్లు నియోజకవర్గంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని కూటమి శ్రేణులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని తన కార్యాలయంలో కూటమి ముఖ్య నాయకులు, శ్రేణులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా, అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రూ.1200 కోట్ల వరకు నిధులను తీసుకొచ్చి వివిధ పనులు చేపట్టినట్లు వివరించారు.

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. సిమెంట్ రహదారుల నిర్మాణం, సిమెంట్ డ్రైన్ల ఏర్పాటు, రైతులకు ఉపయోగపడే పుంత రహదారుల అభివృద్ధి, మంచినీటి పథకాల పనులు తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇప్పటికే పూర్తిచేసిన అభివృద్ధి పనులతో పాటు, మిగిలిన కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ ప్రయోజనాలు, ఇంకా చేపట్టాల్సిన పనులపై నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే కూటమి అభ్యర్థులకు ప్రధాన బలమని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కోరారు.

# గతం మరిచి నీతులు వల్లిస్తున్న జగన్

- గొడ్డలిపార్టీ హయాంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ అపహాస్యం
- గతంలో 'ఏకగ్రీవాల'ను ఘనంగా కీర్తించి నేడు వేరే పల్లవి
- నాడు స్థానిక ఎన్నికల్లో 82 శాతం విజయాలు నిజమైతే, అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం ఓటములకు కారణాలు చెప్పు జగన్ రెడ్డీ
- దూర ప్రాంతాల నుంచి మారణాయుధాలు, రౌడీలను ఎందుకు రప్పించావు?
- ప్రజాస్వామ్య హననం అంటూ ప్రెస్ మీట్‌లో చిరు నవ్వులు చిందించి అభాసుపాలైన జగన్
- జగన్‌రెడ్డికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘాటు కౌంటర్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక ఎన్నికల ప్రక్రియ గాడి తప్పిందంటూ, ప్రజాస్వామ్యాన్ని ప్రజలు రక్షించుకోవాలంటూ శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ నిజంగా దారి తప్పితే ఆందోళన వ్యక్తం చేయడానికి బదులు, అది తమ పార్టీ మంచికే జరిగిందన్నట్లు తన హావభావాలు, చిరు నవ్వులతో తన అంతరంగాన్ని ప్రెస్ మీట్‌లో వెల్లడించుకుని మాజీ సీఎం జగన్‌రెడ్డి అభాసుపాలయ్యారని మంత్రి ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని, ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా చెరబట్టిన కరుడుగట్టిన ప్రజాస్వామ్య వ్యతిరేకి జగన్‌రెడ్డి నేడు నీతులు చెబుతున్నారని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

### నాడు ఘనమైనది.. నేడు నీచమా

ప్రతికూల అధికారి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా (ఎస్‌ఈసీ)గా ఉన్నప్పటికీ గత స్థానిక ఎన్నికల్లో తన పార్టీ 82 శాతం స్థానాల్లో ఘన విజయాలు సాధించిందని, ముఖ్యమంత్రిగా తాను చేసిన మంచి పనులే దానికి కారణమని జగన్‌రెడ్డి స్వోత్కర్షగా చెప్పుకోవడాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ దుయ్యబట్టారు. అక్రమాలు ఏవీ లేకుండా జరిగినదే నిజమైతే అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ 94 శాతం స్థానాల్లో ఎందుకు ఓడిపోయిందో మాజీ సీఎం తెలపాలని మంత్రి నిలదీశారు.

గత స్థానిక ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగంతో విచ్చలవిడిగా ఏకగ్రీవాలను పోగుచేసుకొని ఏకగ్రీవ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఉన్నత దశ అన్నట్లుగా కీర్తించి, ప్రస్తుత ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు కొన్ని చోట్ల నామినేషన్లు వేయకపోవడంపై కూటమి ప్రభుత్వంపై బురదజల్లడం జగన్‌రెడ్డి రాజకీయ దివాళాకోరు తనానికి తార్కాణమని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు.

ప్రస్తుత ఎన్నికల వేళ అధికార కూటమి, ఉన్నతాధికారులు, పోలీసులు కుమ్మక్కై ప్రజాస్వామ్య వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన జగన్‌రెడ్డి, దూర రాష్ట్రాల నుండి రౌడీలు, బౌన్సర్లు, మారణాయుధాలను రప్పించిన విషయంపై ఎందుకు స్పందించలేదని మంత్రి ప్రశ్నించారు. ఆయన మౌనమే అంగీకారమని, ఆ స్థాయిలో హింసకు ప్రణాళికలు వేసి ఇతరులపై నిందలు వేయడం సబబా అని మంత్రి నిలదీశారు.

### ప్రజాస్వామ్య ఘాతుకంపై చిరునవ్వులు సబబా?

ప్రజాస్వామ్యం గాడి తప్పితే అందరికీ ఆందోళనకరమే అని...అయితే ప్రెస్ మీట్‌లో జగన్ వైఖరి అందుకు భిన్నంగా ఉందని మంత్రి సత్యకుమార్ ఎత్తి చూపారు. కొన్ని వీడియోలు ప్రదర్శిస్తూ...చూడండి ప్రజాస్వామ్యంపై ఏవిధంగా దాడులు జరిగాయో అంటూ...చిరునవ్వులు చిందిస్తూ జగన్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఆయనలో అంతర్లీనమై ఉన్న ప్రజాస్వామ్య వ్యతిరేకతను స్పష్టంగా తేటతెల్లం చేసిందని మంత్రి వ్యాఖ్యానించారు. ఆయా ఘటనలు చూపేటప్పుడు వ్యక్తం కావాల్సిన ఆందోళన ఏమాత్రం జగన్ రెడ్డిలో వెల్లడికాలేదని మంత్రి అన్నారు.

దరిమిలా...తన పార్టీవారు కొన్ని చోట్ల నామినేషన్లు వేయకపోవడం తమకు మంచిదేనన్నట్లు, పోటీ చేసి ఓడిపోవడం కంటే, ప్రత్యర్థులు తమవారిని నామినేషన్లు వేయనీయలేదని అభాండాలు వేసి తప్పుకోవడమే మంచిదన్నట్లుగా జగన్ వ్యవహరించారని మంత్రి వివరించారు. పలువురు వైసీపీ అభ్యర్థులు ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోవడం కంటే, అసంపూర్ణ తప్పుడు నామినేషన్లు వేసి తిరస్కరణకు గురికావాలనే ఉద్దేశపూర్వకంగా చేసినట్లు తన వద్ద సమాచారం ఉందని మంత్రి తెలిపారు.

### ఆధారాలు చూపించు జగన్‌రెడ్డీ

కొన్ని చోట్ల తన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకపోవడంపై నానా యాగీ చేస్తున్న మాజీ సీఎం జగన్‌రెడ్డి, సదరు ఏకగ్రీవాలపై నాడు–నేడుకు సంబంధించిన వాస్తవాల ఆధారంగా మాట్లాడే సాహసం ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. ఆయన హయాంలో ఏకగ్రీవాలైన మేయర్లు, మునిసిపాలిటీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సర్పంచ్‌ల సంఖ్యలు, నేటి వివరాలతో పోల్చి వివరిస్తే బాగుంటుందని మంత్రి హితవు పలికారు.

### కూటమి ఘన విజయం తథ్యం

ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే జగన్‌రెడ్డి ఓటమి బాట



పట్టారని, ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగితే తామే గెలుస్తామని చెపుతూ ఓటమి కారణాలను ముందే ఎంచుకొని ప్రచారంలో పెట్టారని మంత్రి స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి చేపట్టిన పలు పథకాలు, సాధించిన ఫలితాలతో ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయాన్ని సాధిస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

### అనంతపురం మేయర్ అభ్యర్థిని ఎందుకు మార్చారు?

నామినేషన్లకు ముందు అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పదవికి తమ పార్టీ అభ్యర్థిగా ముస్లిం అభ్యర్థిని ఘనంగా ప్రకటించిన జగన్‌రెడ్డి, అధికార కూటమి ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించిన వెంటనే జగన్ తన అభ్యర్థిగా హిందువును ప్రకటించారని, దీనికి ఆయన జవాబు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అవసరాన్ని బట్టి రంగులు మార్చే జగన్ నిజమైన వైఖరికి ఇదే ఉదాహరణ అని మంత్రి ఎద్దేవా చేశారు.

### వేదాలు వల్లించే దెయ్యం జగన్‌రెడ్డి

అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు రాజారెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో, ప్రజాస్వామ్య వ్యతిరేకత, పెత్తందారీ మానసికతతో వ్యవహరించే జగన్‌రెడ్డి నేడు ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి ఏకరువు పెట్టడం దెయ్యాలు వేదాలు పలికినట్లుందని మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు. జగన్ అంతరంగం ప్రజలకు ఇప్పటికే స్పష్టమైందని, ఆయన మంత్రాలకు చింతకాయలు రాలవన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల ఆస్తులను లాక్కునేందుకు విశ్వ ప్రయత్నం చేసిన జగన్‌రెడ్డి నేడు తమ ఆస్తుల రక్షణ పట్ల ప్రజలకు హెచ్చరించడం, నేడు నామినేషన్లు చించిన వారు రేపు ప్రజల ఆస్తుల పత్రాలను చింపుతారని అనడం ఆయన 'గిల్టీ' మైండ్‌ని వెల్లడిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

## విశాఖ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్ ప్రసాద్



విశాఖపట్నం: (చైతన్యరథం): విశాఖపట్నంలోని 50వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, కూటమి/టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. బుచ్చిరామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అభ్యర్థి భవాని, సీనియర్ నాయకులు రామ కోటయ్య, బీజేపీ నాయకులు, విశాఖపట్నం పార్లమెంట్/శాసనసభ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎం.డి. షరీఫ్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కే. బుచ్చిరామ్ ప్రసాద్ మాట్లాడుతూ... ”శాసనమండలి మాజీ చైర్మన్, విశాఖ ఎన్నికల ఇన్‌చార్జ్ షరీఫ్ అంటే నాకు అత్యంతమైన గౌరవం. ఆయనను చూస్తుంటేనే ఒక నిబద్ధత, ఉత్సాహం కనిపిస్తాయి. గతంలో అమరావతి పరిరక్షణలో, న్యాయం వైపు నిలబడటంలో ఆయన పోషించిన పాత్ర మరవలేనిది. నాటి ప్రభుత్వం ఆయనపై ఎన్నో ఒత్తిళ్లు తెచ్చినా, అనేక ఇబ్బందులకు గురిచేసినా సరే బెదిరిపోకుండా నిలబడ్డారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఉన్నతమైన ఆశయాలు, సిద్ధాంతాల కోసం నిరంతరం శ్రమించే షరీఫ్ లాంటి నాయకులు విశాఖపట్నం ఎన్నికల బాధ్యతలు చేపట్టడం మనందరి అదృష్టం. ఆయన నాయకత్వంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తాం. అభ్యర్థి భవాని విజయం కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో కలిసికట్టుగా పనిచేయాలి. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా కూటమి విజయానికి, చంద్రబాబు ఆశయ సాధనకు నా పూర్తి మద్దతు ఉంటుంది” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, మహిళలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్యే అదితి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవి, కార్పొరేటర్లుగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శుక్రవారం ఉల్లివీధిలో విజయనగరం వాణిజ్యమండలి ఆధ్వర్యంలో జరిగిన పరిచయ వేదికపై ఆమె మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వ్యాపారస్థులకు అండగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అదితి చెప్పారు. వ్యాపారులు, వారి కుటుంబాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె విన్నవించారు. ఒకసారి మేయర్‌గా అవకాశం ఇస్తే వ్యాపార వర్గాలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని భార్గవి చెప్పారు. వ్యాపార వర్గాల ప్రతినిధులు కాపు గంటి శ్రీనివాస్, నిర్మల్ కుమార్ జైన్, టీడీపీ నాయకులు అవనాపు విజయ్, కేదారిశెట్టి సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ మంత్రి, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి, 89వ వార్డు కూటమి అభ్యర్థి శ్రీమతి ప్రసాదుల విజయ సునీతను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కూటమి అభ్యర్థుల విజయంతో నగరంలో అభివృద్ధి పరంపర కొనసాగుతుందని పేర్కొన్నారు. 74వ వార్డు మాజీ అధ్యక్షుడు వియ్యపు కొండబాబు అధ్యక్షతన వియ్యపు వానిపాలెంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వార్డుల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పల్లా రమణ, సింగూరు అనంతు, జాజుల గంగరాజు, నమ్మి సింహాద్రి, కోన రాజు, మొల్లి చిన్నోడు, వియ్యపు అప్పలనాయుడు, మాజీ కౌన్సిలర్ బుట్ట సత్తిబాబుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో తుఫాను... రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు



విశాఖపట్నం (చైతన్యరథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతుండటంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో వాతావరణం మారే సూచనలు కనిపిస్తున్నాయి. అక్టోబర్ 26వ తేదీ ఉదయానికి ఇది తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అనంతరం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందని తెలిపింది. దీంతో రానున్న రోజుల్లో ఏపీలో వర్షాలు, బలమైన గాలుల ప్రభావం ఎలా ఉండబోతోందన్న దానిపై ఆసక్తి నెలకొంది. విశాఖపట్నం వాతావరణ కేంద్రం డైరెక్టర్ పి. లక్ష్మీ నరసింహామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 23న ఉదయం 5.30 గంటలకు ఆగ్నేయ, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించింది. ఈ అల్పపీడనం అక్టోబర్ 24న వాయుగుండంగా, 25న తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత 26వ తేదీ ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో అక్టోబర్ 27 నుంచి ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అందిన వివరాలు సూచిస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం కూడా ఉందని హెచ్చరికల్లో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో హింసకు పాల్పడితే కఠిన చర్యలు : ఏపీ డీజీపీ హెచ్చరిక

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు ఏపీ పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో హింస, బెదిరింపులకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో డీజీపీ ఇవాళ మంగళగిరిలో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అభ్యర్థులు నిరాటంకంగా నామినేషన్లు దాఖలు చేయడానికి, చట్టబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనేందుకు పూర్తి రక్షణ కల్పిస్తామని ఈ సందర్భంగా డీజీపీ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు, బెదిరింపులు లేదా అడ్డంకులను సహించేది లేదని, నామినేషన్ కేంద్రాల వద్ద బారికేడ్లు దాటడం, రహదారుల దిగ్బంధం, విధుల్లో ఉన్న పోలీసులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని డీజీపీ హెచ్చరించారు.

## తూర్పు కాపులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది

- వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): తూర్పు కాపుల అభివృద్ధికి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. వీరికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్తపేటలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన తూర్పు కాపు సంఘీయుల సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు కాపుల సంక్షేమం, అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

**తూర్పు కాపులకు వివిధ పదవుల్లో ప్రాధాన్యం**

గతంలో నిర్వహించిన ‘మన వార్డులో -- మన ఆదిరెడ్డి’ కార్యక్రమంలో భాగంగా తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన నానిపల్లి అప్పారావు, రఘు ఇళ్లలో రాత్రి బస చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు వివిధ సంస్థల్లో బాధ్యతలు అప్పగిస్తూ ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్ చైర్మన్‌గా చింతా జోగినాయుడు మాస్టర్‌ను నియమించినట్లు చెప్పారు. అలాగే ఉమా మార్కండేయ స్వామి ఆలయ డైరెక్టర్‌గా సనపతి సత్తిబాబు, గౌతమి జీవకారుణ్య సంఘం డైరెక్టర్‌గా పోలాకి శ్రీదేవి, కొత్తపేట సోమాలమ్మ అమ్మవారి ఆలయ డైరెక్టర్‌గా అట్టాడ రవికి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు.

**ఆలయాలు, సామాజిక అవసరాలకు విరాళాలు**

తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆలయాల అభివృద్ధితోపాటు సామాజిక అవసరాల పరిష్కారానికి ఆర్థిక సహాయం అందించినట్లు ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 29వ డివిజన్‌లోని వినాయకుడి ఆలయానికి రూ.లక్ష విరాళంగా అందించినట్లు చెప్పారు. 6వ డివిజన్‌లో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.లక్ష, అదే డివిజన్‌లోని కనకదుర్గమ్మ ఆలయానికి రూ.1.50 లక్షలు అందించినట్లు వివరించారు. అదేవిధంగా 6వ డివిజన్‌లోని వాంబే గృహాల వద్ద నెలకొన్న సెప్టిక్ ట్యాంకుల సమస్య పరిష్కారానికి రూ.లక్ష కేటాయించినట్లు తెలిపారు. 31వ డివిజన్‌లోని వినాయకుడి ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.8 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. అవసరాలను గుర్తించి, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తూర్పు కాపు సామాజిక వర్గ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తూర్పు కాపు నాయకులు అధిక సంఖ్యలో తూర్పు కాపు సంఘీయులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెం అభివృద్ధి కూటమితోనే సాధ్యం : దాసరి శ్యామ్ చంద్రశేషు



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): త్వరలో జరుగుతున్న జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఎన్నుకల్లో 24వ వార్డు నుండి కూటమి తరపున పోటీ చేస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు చిట్టిబొయిన రామలింగేశ్వరరావు ప్రచారం ముమ్మరం చేశారు. శుక్రవారం ప్రచారంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు పాల్గొని ఓటర్లను అభ్యర్ధించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అలాగే జంగారెడ్డిగూడెంలో జరిగిన అభివృద్ధి వివరించారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ పథకం, తల్లికి వందనం వంటి పథకాలు సిమెంట్ రోడ్ల నిర్మాణం వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని రాష్ట్రంలో కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉందని ఇక్కడ కూడా కూటమిని గెలిపిస్తే అభివృద్ధి బులెట్ స్పీడ్‌లో పరుగులు పెడుతుందని అన్నారు. అనుభవం ఉన్న వ్యక్తి రామలింగేశ్వరరావు అని అలాంటి వ్యక్తికి అవకాశం ఇస్తే ఇంకా అద్భుతంగా పని చేసి వార్డును అభివృద్ధి పథంలో నిలుపుతారని అన్నారు. ఈ ప్రచారంలో ఉదర సుబ్బారావు, కొంచడా ఉమా ప్రసాద్, తామాడా రమణ, కోట శివ, సమీర్ రాగాని శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన అభివృద్ధి.. గడపగడపకు సంక్షేమం

●స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

●మన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో పాలకొల్లు నియోజకవర్గంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో కూటమి ముఖ్య నాయకులు, శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా, అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 1200 కోట్ల వరకు నిధులను తీసుకొచ్చి వివిధ పనులు చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. సిమెంట్ రహదారుల నిర్మాణం, సిమెంట్ డ్రైన్ల ఏర్పాటు, రైతులకు ఉపయోగపడే పుంత రహదారుల అభివృద్ధి, మంచినీటి పథకాల పనులు తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**ప్రజల మద్దతు కూడగట్టేలా సమన్వయంతో పనిచేయాలి**

దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇప్పటికే పూర్తిచేసిన అభివృద్ధి పనులతో పాటు, మిగిలిన కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ ప్రయోజనాలు, ఇంకా చేపట్టాల్సిన పనులపై నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే కూటమి అభ్యర్థులకు ప్రధాన బలమని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామస్థాయిలో ప్రజ భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కోరారు.

# గన్నవరం ఎస్సీ కాలనీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

●100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే యార్లగడ్డ

●విజయవాడ పార్టీ కార్యాలయంలో చేరికలు.. సాదరంగా ఆహ్వానించిన యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన బత్తుల సురేష్, నిడమర్తి రాంబాబు, పోలిమేర సుధాకర్‌తో పాటు తదితరులు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అందిస్తున్న పాలన పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి తులసి మోహన్, కాసర్నేని రంగబాబు, కొమ్మరాజు సుధీర్, పాలడుగు నాని, తిరువీధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమికి ఓటు.. అభివృద్ధికి రూటు : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయడం గుంటూరు నగర అభివృద్ధికి బాటలు పరవడమేనని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక 75, 76 డివిజన్లలో నగర మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థులు ఏల్చూరి నాగక్రాంతి, అంకం మాలినితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి డివిజన్ లోనూ ప్రజలు కూటమి నేతలకు బ్రహ్మరథం పట్టారు. రెండున్నరేళ్లలో అన్ని వర్గాలకు మేలు జరగడంతో అభివృద్ధిని కొనసాగించేందుకు కూటమి నేతలకు తాము మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఆర్థిక సంఘ నిధులు మంజూరవుతాయని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనికి అడ్డుకునేందుకు గొడ్డలి కుయుక్తులు పన్నుతోందని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. రాష్ట్రంలో త్వరలో నూతన పింఛన్లు మంజూరు చేయబోతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించబోతున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.

# ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌తో నాయకుల వరుస భేటీలు

●స్థానిక ఎన్నికల కీలక దశలో ఎంపీ తో పలువురు నేతల భేటీ

●జిల్లాలో పరిస్థితులపై ఎంపీతో ఎమ్మెల్యే బడేటి చంటి చర్చలు

●ఎంపీతో ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే మురళి భేటీ



ఏలూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలు కీలక దశలో ఉన్నవేళ ఏలూరు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల నుంచి పలువురు నేతలు గత రెండు రోజుల నుంచి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఇంటికి క్యూ కడుతున్నారు. ముఖ్యంగా జడ్పీ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ నెలకొనడం, పలు మండలాల్లో టికెట్ల కోసం పోటాపోటీ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి సహా పలువురు నేతలు ఎంపీతో భేటీ అయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఆశావహులు, సమన్వయంపై ఇరువురు నేతలు దాదాపు 45 నిమిషాలు చర్చలు జరిపారు. అంతకుముందు ఉదయం 10 గంటల సమయంలో మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో భేటీ అయ్యారు. కూటమి తరఫున ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేననేత రెడ్డి అప్పలనాయుడు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నగరంలోని రాజకీయ పరిస్థితులను వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మేయర్ ఎన్నికల్లో రెడ్డి అప్పలనాయుడు ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నానని చెప్పిన ఎంపీ, ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు.

# కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం రూరల్ మండలం కొంతమూరు, మరియు కడియం మండలం జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులుగా కూటమి అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల రవిరామ్ కిరణ్, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్, వాసిరెడ్డి రాంబాబు, అన్నందేవుల చంటి, వెలుగుబంటి రఘురామ్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, గట్టి బ్రదర్స్, అద్దాల శ్రీనివాస్, కూటమి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ సందర్భంగా కోరారు.

# ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 84వ, డివిజన్ ప్రజాశక్తి నగర్ నాలుగు స్తంభాల సెంటర్ నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి లబ్బా. దుర్గ పార్టీ ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం ఉధృతంగా కొనసాగుతోంది అని, ఈరోజు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ప్రజల్లోకి వెళ్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని గత 27 నెలలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ పథకాలను అమలు చేస్తోందని, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం, అన్న క్యాంటీన్ల వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, విజయవాడ నగర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నగరపాలక సంస్థలో ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజలతో మమేకమవుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు.

# కంకిపాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా దండమూడి పూజిత నామినేషన్ దాఖలు



కంకిపాడు (చైతన్యరథం): కంకిపాడు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా కూటమి పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్న సతీమణి దండమూడి పూజిత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ కార్యాలయం నుంచి మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత భారీ ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో దండమూడి పూజిత తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, యువతను ఏకతాటిపై నడిపిస్తున్న దండమూడి చౌదరి నాయకత్వానికి మద్దతుగా యువత పెద్ద సంఖ్యలో తరలిరావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువ నాయకత్వానికి ప్రాధాన్యత, ప్రజాసేవకు అంకితభావం, గ్రామీణ అభివృద్ధికి నిబద్ధత అనే లక్ష్యాలతో దండమూడి పూజిత అభ్యర్థిత్వానికి కూటమి శ్రేణులు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ ప్రచారం



ఉయ్యూరు (చైతన్యరథం): టీడీపీ చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల విజయానికి మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విస్తృత ప్రచారం. ఉయ్యూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థితో పాటు కౌన్సిలర్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ ఒకటి, రెండు, మూడు వార్డుల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొని టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... ఉయ్యూరు అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలంటే మున్సిపాలిటీలో టీడీపీకి బలమైన పాలన అవసరమన్నారు. చైర్మన్ అభ్యర్థితో పాటు అన్ని వార్డుల్లో టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మరింత సమర్థవంతంగా పనిచేస్తామని చెప్పారు.

**ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ...** ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే టీడీపీ అభ్యర్థుల లక్ష్యమన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు, మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కట్టాలి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): పురపాలక ఎన్నికల సందర్భంగా 3, 4 వార్డుల్లో గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థి షమీంఖాన్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని పుర ప్రజలను కోరారు. అభివృద్ధికి, సంక్షేమానికి మద్దతుగా నిలిచి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## జోగి మేఘన కారు ప్రమాదంపై విచారణకు మహిళా కమిషన్ ఆదేశం

అమరావతి: జోగి మేఘన కారు ప్రమాద ఘటనపై వ్యక్తమవుతున్న అనుమానాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఏపీ మహిళా కమిషన్ ఛైర్పర్సన్ డా. రాయపాటి శైలజ పోలీసులకు సూచించారు. ప్రమాద ఘటన జరిగిన తర్వాత జోగి మేఘన తొలుత మహిళా కమిషన్ ఛైర్పర్సన్ను సంప్రదించి వివరాలు తెలియజేశారు. దీనిపై స్పందించిన శైలజ.. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ఇబ్రహీంపట్నం పోలీసులతో మాట్లాడారు. జోగి మేఘనతో పాటు ఆమె కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాలకు తావులేకుండా సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేశారు. ప్రమాదం వెనుక మాజీమంత్రి జోగి రమేష్ ఉన్నట్టు మేఘన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకు భారీ మెజారిటీ తథ్యం

**●విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 29 డివిజన్లలోనూ కూటమి విజయం ఖాయం : ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి కూటమి పార్టీల తరపున బలపరిచిన మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాతో పాటు వివిధ డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి భాగం సాయి ప్రసాద్, 12వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థి చెన్నుపాటి క్రాంతి శ్రీ, 17వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థి కోనేరు రాజేష్‌లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని మొత్తం 29 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా భారీ మెజారిటీతో గెలుపొందడం తథ్యమని స్పష్టం చేశారు. ప్రజలు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే విజయవాడ నగర రూపురేఖలను మార్చి, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కూటమి నేతల సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తా : లక్ష్మీ అపర్ణ కోవెలమూడి

**●కిలారు రోశయ్య ఆధ్వర్యంలో జనసేన నేతలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర అభివృద్ధికి కూటమి నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థుల సహకారంతో సమష్టిగా కృషి చేస్తానని గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ తెలిపారు. గుంటూరులో జనసేన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారు రోశయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు, మహిళలకు అవకాశాలు కల్పించడంలో చంద్రబాబునాయుడు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి, ఎమ్మెల్యేలు గల్లా మాధవికి, నజీర్ అహ్మద్‌కి, బూర్ల రామాంజనేయులుకి ధన్యవాదాలు తెలుపుతూ, కూటమి తరపున పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులందరితో కలిసి ముందుకు సాగుతానని, వారి సహకారంతో గుంటూరు నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కిలారు రోశయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేదికపై ఉన్న పెద్దలందరికీ నమస్కారాలు తెలిపారు.

**గుంటూరు అభివృద్ధికి లక్ష్మీ అపర్ణ నాయకత్వం: కిలారు రోశయ్య**

జనసేన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారు రోశయ్య మాట్లాడుతూ.. గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణను ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీయే కూటమి తరపున ఆమెకు అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. కోవెలమూడి నాని తన చిన్ననాటి మిత్రుడని, ఆయన మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో నగరంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. కార్పొరేటర్ల ద్వారా నిధులు కేటాయించి సిమెంట్ రహదారులు, కాలువల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే మా ధ్యేయం : టీడీపీ నేత బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): కూటమి రెండున్నరేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మంచి చేసిందని రాబోయే విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, టీడీపీ సీనియర్ నేత చెన్నూపాటి శ్రీను కోరారు. శుక్రవారం 56వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొలగాని అశోక్‌తో కంసాలిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు, డివిజన్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై స్థానికులతో చర్చించారు. విజయవాడ నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలతో కొండ ప్రాంత వాసులకు శాశ్వత హక్కులు

**●కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తాం అంటున్న ప్రజలు...**

**●ఎన్నికల ప్రచారంలో టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్**



విజయవాడ (చైతన్యరథం): నగరంలోని కొండ ప్రాంత వాసులు తమకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా ఆస్తిపై పూర్తి హక్కు కల్పించిన కూటమి ప్రభుత్వానికి, మరియు కూటమి పార్టీల కార్పొరేటర్ మరియు మేయర్ అభ్యర్థులకు అండగా ఉంటామని చెబుతున్నారని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 5వ డివిజన్ పరిధిలోని గంగిరెద్దుల దిబ్బ ఏరియలో టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి సంగీత లక్ష్మీతో కలిసి టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించి కూటమి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ గతంలో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న అనేక కుటుంబాలు తమ ఇళ్లపై పూర్తి హక్కులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా ఆయా కుటుంబాలకు భరోసా కల్పించిందని తెలిపారు. ఇళ్ల పట్టాలు పొందడంతో తమ నివాసాలపై చట్టబద్ధమైన హక్కు లభించిందనే సంతోషాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కల్పించిన ఈ హక్కుతో తమ కుటుంబాలకు భద్రత ఏర్పడిందని, భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని కొండ ప్రాంత వాసులు చెబుతున్నారని క్రాంతి కుమార్ అన్నారు. తమకు ఇళ్ల పట్టాలు అందించిన ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతామని వారు పేర్కొంటున్నారని వివరించారు.

# ఏపీ మున్సిపల్ ఎన్నికలకు కొత్త షెడ్యూల్ విడుదల

●నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న కౌంటింగ్

●ఈ నెల 23, 24 తేదీల్లో నాలుగు చోట్ల నామినేషన్ల స్వీకరణ



ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజుజ సవరించిన షెడ్యూల్ ప్రకటించింది. కొత్త షెడ్యూలు ప్రకారం నవంబరు 1న 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు/ నగర పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఒకవేళ అవసరమైన చోట్ల నవంబర్ 2న రీపోలింగ్ నిర్వహించి నవంబర్ 3న ఓట్లు లెక్కించనున్నారు. మైదుకూరులోని 32 వార్డులు, రాజంపేటలోని 11 వార్డులకు నామినేషన్ దాఖలు చేసేందుకు సమయం పొడిగించారు. అలాగే కడప కార్పొరేషన్‌లోని 11, తిరుపతిలోని 18 డివిజన్లకు కూడా కొత్తగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. ఇలా మొత్తంగా 72 వార్డులు/ డివిజన్లకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తారు.. 25న ఉదయం నామినేషన్ల పరిశీలన, అదేరోజు ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కొత్తగా దాఖలైన నామినేషన్ల పరిశీలన ఈ నెల 25న ఉదయం 8 గంటల నుంచి ఉంటుంది.. ఆ తర్వాత ఉపసంహరణ ఉంటుంది. వార్డుల వారీ నామినేషన్ల స్వీకరణ గడువు పొడిగించిన పట్టణ స్థానిక సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి. కడప కార్పొరేషన్‌లోని 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55 (11 వార్డులు). రాజంపేట మున్సిపాలిటీలోని 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27 (11 వార్డులు). మైదుకూరు మున్సిపాలిటీలోని 32 వార్డులు. తిరుపతి కార్పొరేషన్‌లో 1, 2, 3, 4, 5, 6, 9, 11, 12, 13, 14, 19, 55, 56, 57, 59, 65, 66 (18 వార్డులు)కు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తారు. కొత్తగా నామినేషన్లను గతంలో ప్రకటించిన నామినేషన్ కేంద్రాలతో పాటు అదనంగా జిల్లా కలెక్టరేట్ల ప్రాంగణాల్లోనూ స్వీకరిస్తారు. మిగిలిన చోట్ల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి మార్పులేదు. APSEC సవరించిన షెడ్యూల్ ప్రకారం 25న అభ్యర్థుల తుది జాబితా ప్రచురిస్తారు.. నవంబర్ 1న పోలింగ్, 2న రీపోలింగ్, 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. అలాగే సిరిమాను ఉత్సవం కారణంగా విజయనగరం నగరపాలక సంస్థకు అక్టోబరు 28న కాకుండా.. 29న పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే కొత్త షెడ్యూల్ రావడంతో ఇక్కడ కూడా నవంబరు 1న పోలింగ్ నిర్వహించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం తొలివిడతలో 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు నోటిఫికేషన్ జారీచేసి..ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించింది. ఈ నెల21న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణలకు గడువు ఇచ్చింది. కానీ తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారంటూ వైసీపీ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కీలక ఆదేశాలు ఇచ్చింది. తుది జాబితా ప్రకటనను వాయిదా వేసి నామినేషన్లు వేయలేకపోయినవారికి అవకాశం కల్పించాలని ఆదేశించింది. దీంతో SEC ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసింది. అన్ని జిల్లాల నుంచి నివేదికల్ని కోరి వాటిని పరిశీలించి కొత్త షెడ్యూల్ ప్రకటించారు.

# వీబీజీ రామ్‌జీ పనులపై పశ్చిమ బెంగాల్ బృందం ప్రశంసలు



నందిగామ (చైతన్యరథం): వీబీజీ రామ్జీ పథకం అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు పశ్చిమ బెంగాల్ అధికారుల బృందం ఆంధ్రప్రదేశ్లో పర్యటిస్తోంది. ఈ క్షేత్రస్థాయి పర్యటనకు ముందు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వి.ఆర్. కృష్ణ తేజ మైలవరపును రాష్ట్ర కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పథకం కింద చేపడుతున్న పనులు, అమలు విధానాలను కమిషనర్ బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ రూరల్, నందిగామ మండలాల్లో వివిధ అభివృద్ధి పనులను బృందం పరిశీలించింది. మ్యాజిక్ డ్రెయిన్లు, ఫారంపాండ్లు, ఉద్యాన పంటలు, పశువుల షెడ్ల పనులను ప్రశంసించిన పశ్చిమ బెంగాల్ అదనపు కార్యదర్శి సమీర్ దాస్.. ఏపీలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తమ రాష్ట్రంలోనూ అనుసరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో టీడీపీలోకి భారీ చేరికలు



గుడ్లవల్లేరు (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలోని గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు శుక్రవారం రాత్రి టీడీపీలో చేరాయి. గ్రామ పెద్ద చావ కాళీ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కుటుంబాలకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావుతో కలిసి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలవడంతో పాటు, గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరినట్లు చావ కాళీ ప్రసాద్, నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాము నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీకి మద్దతుగా నిలిచామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నెలలో రెండు, మూడు పర్యాయాలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారని కొనియాడారు. పార్టీ శ్రేణులకు కేవలం నాయకుడిగానే కాకుండా, కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి అవుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమిష్టి కృషి ఫలితంగానే గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా నిలిచిందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ఐక్యతతో ముందుకు సాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. “నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, నాయకులు, కార్యకర్తలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే నిర్ణయిస్తున్నామన్నారు.అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనూ ఆయా గ్రామాలు, మండలాల్లోని స్థానిక నాయకత్వ అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు.క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులకు అవకాశాలు కల్పించాలన్నదే మా ఉద్దేశం” అని స్పష్టం చేశారు.

# చిత్తూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా



చిత్తూరు (చైతన్యరథం): నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారం నగర వ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా పాల్గొన్నారు. నగరంలోని పలు వార్డుల్లో, ముస్లిం మైనార్టీల ఏరియాలలో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… మైనార్టీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు భరోసా లభించిందని ఆయన అన్నారు. చిత్తూరు నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇప్పటికే గత 30 నెలల్లో రూ. 559 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నగరం ముందంజలో ఉందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి కలారి హేమలత, శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ నేతృత్వంలోని కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ తేదీ నవంబర్ 1న జరగనున్న ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటు వేసి కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని హాజీ షేక్ హసన్ బాషా కోరారు. చిత్తూరు నగర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

# మరింత అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

● మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పిలుపు



మార్కాపురం (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. రెండో రోజు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కూటమి చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునకి మరియు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా 13,14,15,16వ వార్డుల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ… ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేశామని మరియు వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి నీటిని కూడా నల్లమల్లసాగర్‌కు విడుదల చేశామని అన్నారు. ఈ ప్రాంతానికి హార్టికల్చర్ హబ్ తీసుకువచ్చామని, మార్కాపురం పట్టణానికి ఇంటింటికి పైప్ లైన్ ద్వారా నీటిని అందించే పనిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని, 35 కోట్ల రూపాయలతో పట్టణంలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశామని త్వరలోనే వాటికి పూర్తి చేస్తామని, 30 కోట్ల రూపాయలతో సిసి డ్రైనేజీ లు పూర్తి చేస్తామని అన్నారు. పట్టణ శివారు ప్రాంతాలైన చెన్నరాయునిపల్లి, పూల సుబ్బయ్య కాలని ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. చైర్మన్ అభ్యర్థి అయిన వక్కలగడ్డ మల్లికార్జునని, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను మరింత మెజార్టీతో గెలిపించాలని తద్వారా మార్కాపురం మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో చైర్మన్ అభ్యర్థి మరియు కౌన్సిలర్ అభ్యర్థులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగం వద్దని... ప్రజా సేవే ముఖ్యం

● పరిషత్ పోరులో టీడీపీ నుంచి 22 ఏళ్ల స్వాతిక పోటీ



గుంటూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు వయసుపరంగా పెద్ద వారితో పాటు స్థానిక నాయకులు పోటీ పడుతుంటారు. అయితే పరిషత్ పోరులో నేను సైతం సిద్ధమంటూ.. ఓ యువ గ్రాడ్యుయేట్ ముందుకు వచ్చారు. వట్టిచెరుకూరు జడ్పీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా ముట్లూరు గ్రామానికి చెందిన గొరికపూడి సాత్విక (22) గురువారం గుంటూరు జిల్లాపరిషత్తు కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఇటీవలే బి.టెక్ డిగ్రీని పూర్తి చేశారు. ఉద్యోగానికి వెళ్లకుండా ప్రజాసేవను ఎంపిక చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. తల్లిదండ్రులు గొరికపూడి ద్వారక, బుజ్జిబాబుల కుటుంబం గత 25 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతోంది. జిల్లా పరిషత్తు ఛైర్పర్సన్ పదవి ఎస్సీ మహిళలకు రిజర్వ్ అయింది. దీంతో వట్టిచెరుకూరు జడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యారు. విద్యావంతురాలైన యువ గ్రాడ్యుయేట్ పరిషత్ పోరుకు నామినేషన్ వేసేందుకు జడ్పీకి రావడంతో అందరి దృష్టిని ఆకర్షించారు.

# జోన్-5

(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)

## నల్లచెరువు జడ్పీటీసీగా పరిటాల శ్రీరామ్ నామినేషన్

●జిల్లాలో సరికొత్త రాజకీయ పరిణామం

●ఎమ్మెల్యేలు కందికుంట, ఎంఎస్ రాజుతో కలిసి శ్రీరామ్ నామినేషన్

●స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తామన్న శ్రీరామ్



శ్రీ సత్యసాయి జిల్లా (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ సరికొత్త రాజకీయాలు తెరపైకి వచ్చాయి. ఎవరూ ఊహించని విధంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎలాంటి హడావుడి లేకుండా, అత్యంత సాదాసీదాగా ఆయన ఈ నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ వెంట కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అన్ని చోట్లా క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో లాగా దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు ఇప్పుడు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా జరుగుతోందని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునే అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరితోనూ నామినేషన్లు వేయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన సూచనలు చేశారని శ్రీరామ్ గుర్తుచేశారు. సీఎం ఆదేశాల ప్రకారమే ఇవాళ తమతో పాటు ఇండిపెండెంట్లు, అన్ని రాజకీయ పార్టీల వారు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని తెలిపారు. గత మూడు రోజులుగా ఈ నామినేషన్ల ప్రక్రియ అంతా ప్రశాంతంగా సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమం, ప్రగతిని చూసి ప్రజలు కచ్చితంగా తమ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తారని పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల శ్రీరామ్ జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం కనిపించింది.

## ఆదోని మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల దాఖలు




ఆదోని (చైతన్యరథం): ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో, నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో ఆదోని మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీటీసీ అభ్యర్థులుగా తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నామినేషన్ల ప్రక్రియలో భాగస్వాములయ్యారు.

## అనంతపురం రూరల్‌లో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



అనంతపురం (చైతన్యరథం): అనంతపురంలో పరిషత్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అనంతపురం రూరల్ మండల పరిధిలోని 36 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కేంద్రాన్ని అనంతపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా నామినేషన్లను అధికారులు స్వీకరించారు. రెండో రోజు టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదాలు నెలకొన్నప్పటికీ, మూడో రోజు ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 31 మండలాలకు సంబంధించి 36 ఎంపీటీసీ స్థానాలకు 199 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో టీడీపీ- 103, వైసీపీ -72, జనసేన -9, ఇతరులవి 15 నామినేషన్లు ఉన్నాయి.

**ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ**

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకున్నట్టు అనంతపురం డీఎస్పీ కరుణాకర్ రావు చెప్పారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో గత మూడు రోజులుగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కార్యక్రమం జరుగుతోంది. 31 మండలాలకు సంబంధించి 36 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజు టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదాలు నెలకొన్నప్పటికీ మూడో రోజు ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సాగుతోంది. పోలీసులే దగ్గరుండి అభ్యర్థులను స్వయంగా తీసుకెళ్లి నామినేషన్లు వేయించారు. పోలీసులు ఏ పార్టీపై పక్షపాతం చూపరని, అన్ని పార్టీలకు సమానంగా చట్ట ప్రకారం పని చేస్తామని డీఎస్పీ వివరించారు.

## కదిరి అభివృద్ధి... కూటమి లక్ష్యం! : కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలోని 13, 14వ వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ అర్షియా భాను మొగల్ ఫారూఖ్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి చైర్మన్ అభ్యర్థి సోదరి షేక్ అర్షియా భానుని, కూటమి తరఫున పోటీ చేస్తున్న 44 మంది కౌన్సిలర్ అభ్యర్థులను తమ అమూల్యమైన ఓట్లతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అరవ గుడిసెల ప్రాంతం వరద ముంపునకు గురై ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో వారికి అండగా నిలిచి ఆదుకున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమని, స్థానిక ఎమ్మెల్యేగా తాను ప్రజలకు అండగా నిలిచానని కందికుంట వెంకటప్రసాద్ గుర్తుచేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, కదిరి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి : మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సూచించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని బూత్ ఇన్‌చార్జ్‌లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చెప్పాం.. చేస్తున్నాం ఇచ్చిన హామీల అమలే మా లక్ష్యం అనే నినాదంతో పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామని, గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ చేస్తున్న ఆరోపణలకు వాస్తవాల ఆధారంగా సమాధానం చెప్పాలని, ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి బూత్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి, ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

## కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి : పూల నాగరాజు

● ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని వెల్లడి



అనంతపురం (చైతన్యరథం) : నగరపాలక సంస్థ పరిధిలో కూటమి పార్టీల తరఫున పోటీ చేస్తున్న 62 మంది అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అజేష్‌బాబుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంలోని 59వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి, జిల్లా ఎన్నికల పరిశీలకుడు ఏరాసు ప్రతాప్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 59వ డివిజన్ కూటమి అభ్యర్థి రాయల్ మురళిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా డివిజన్‌కు చెందిన పలువురు యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, నగరంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు కూటమికి అండగా నిలవాలని పూల నాగరాజు పిలుపునిచ్చారు.

## పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం



పులివెందుల (చైతన్యరథం): పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 23, 26 వార్డులలో లక్ష్మీదేవి, బి.కమలమ్మ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ... గత వైసీపీ పార్టీ హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న మరియు నష్టపోయిన కుటుంబాలకే కౌన్సిలర్ అభ్యర్థిగా అత్యంత ప్రాధాన్యతనిచ్చి బరిలోకి దింపారు. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకుని, పులివెందుల మున్సిపాలిటీలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గీత కుమారి భర్త అయిన తూగుట్ల మధు, గత మూడు నెలల నుంచి సోషల్ మీడియా ద్వారా డ్రైనేజ్ సమస్యలు, సిమెంట్ రోడ్ల మరమ్మతులు, వీధి లైట్లు, పందుల బెడద వంటి అనేక సమస్యలపై స్పందిస్తూ తమ టీమ్‌తో కలిసి ఎప్పుడూ ఆక్టివ్‌గా ఉంటున్నారు. క్యాంప్ ప్రాజెక్ట్ కింద 25 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం మరియు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కోసం 40 కోట్ల రూపాయలతో పులివెందులలో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాము. అమృత్ జలజీవన్ పథకాల ద్వారా తాగునీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను ముందస్తు చర్యల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నవారికి బదులుగా, తమకూ ఒక్కసారి అవకాశం కల్పించాలని పులివెందుల ప్రజలను కోరుతున్నాను. అని బీటెక్ రవి వ్యాఖ్యానించారు.

పరిశ్రమలు, డంపింగ్ యార్డుల పేరుతో పేదల భూములను లాక్కుంటే

# సహించేది లేదు

## ప్రభుత్వానికి టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నర్సింహులు తీవ్ర హెచ్చరిక



**షాద్‌నగర్ (చైతన్యరథం):** నిరుపేదలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములను పరిశ్రమలు, డంపింగ్ యార్డుల పేరుతో బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. షాద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన పేదల భూముల పరిరక్షణ, వాగుల సహజ ప్రవాహం, భూసేకరణ అంశాలపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గత ప్రభుత్వాలు భూ సంస్కరణలు, భూదాన ఉద్యమాల ద్వారా నిరుపేదలకు పంపిణీ చేసిన భూములను నేడు పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల పేరుతో కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పేదలకు జీవనోపాధి కల్పించేందుకు ఇచ్చిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు.

నాగులపల్లి వాగు సహజ ప్రవాహాన్ని మళ్లించే వ్యవహారంలో అధికారుల తీరు ఆందోళనకరంగా ఉందని నర్సింహులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరభ్యంతర పత్రాలు జారీ చేసి బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూడటం సరికాదన్నారు. ఈ అంశంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

సిద్ధాపూర్‌లోని సర్వే నెంబర్లు 361, 252, 278 పరిధిలో దాదాపు 233 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని తిమ్మారెడ్డి గూడెంలో సర్వే నెం.483లో 153 ఎకరాలు, లింగారెడ్డిగూడలో సర్వే నెం.287లో 119 ఎకరాలు, కొండన్నగూడ ప్రాంతాల్లోని భూములను పరిశ్రమల పేరుతో సేకరించాలని చూడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కుల, మతాలకు అతీతంగా నిరుపేదల వద్ద ఉన్న కొద్దిపాటి భూమిని సైతం లాక్కుంటే వారి కుటుంబాలు జీవనాధారం కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉద్యోగాల కంటే భూమే తరతరాల జీవనాధారం

కంపెనీలు కల్పించే ఉద్యోగాలు ఒక పరిమిత కాలానికే ఉంటాయని, వ్యవసాయ భూమి మాత్రం తరతరాలుగా కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తుందని నర్సింహులు అన్నారు. భూములు కోల్పోయిన స్థానికులు తమ సొంత ప్రాంతాల్లోనే కూలీలుగా, కాపలాదారులుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. గతంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపారం పేరుతో దేశంలోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడినట్లుగా, నేడు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పచ్చని పొలాలను బలిచేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు.

### పేదల భూముల పరిరక్షణకు సీఎం జోక్యం చేసుకోవాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నాయకుడిగా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంలో తక్షణం జోక్యం చేసుకోవాలని నర్సింహులు విజ్ఞప్తి చేశారు. లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు ద్వారా గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగునీరు అందిస్తామని చెప్తున్న ప్రభుత్వం, మరోవైపు రైతుల భూములను సేకరించేందుకు ప్రయత్నిస్తే ఆ నీటిని ఎవరు వినియోగించుకుంటారని ప్రశ్నించారు. నిరుపేదల జీవనాధారమైన భూములను కాపాడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పేదల హక్కులకు భంగం కలిగించే భూసేకరణ చర్యలను నిలిపివేసి, సంబంధిత సమస్యలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని నర్సింహులు డిమాండ్ చేశారు.



# పార్టీ కోసం ప్రాణమిచ్చే వ్యక్తి... కార్యకర్తలకు ఆదర్శం

## జగదీష్ మృతి టీఎన్‌టీయూసీకి తీరని లోటు: సంతాప సభలో తెలుగుదేశం పార్టీ నేతల నివాళి

**హైదరాబాద్ (చైతన్యరథం):** ఇటీవల మృతి చెందిన టీఎన్‌టీయూసీ నాయకుడు యలవర్తి జగదీష్‌కి ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు, టీఎన్‌టీయూసీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాలుంచి అంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... 'జగదీష్ చిన్న వయసులోనే మృతి చెందడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అందరూ ఆయన మంచి వాడని చెప్తున్నారు. ఆదర్శ జీవితాన్ని గడిపారు. జగదీష్ నా దగ్గరకు ఎప్పుడు వచ్చిన తమ్ముడు అనే భావన ఉండేది. అతని ముఖం మీద ఎప్పుడూ నవ్వు కనిపించేది. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. ఎందుకంటే నిస్వార్థ కార్యకర్త. టీడీపీ జెండా కనిపిస్తే ముందుండే వ్యక్తి. పార్టీ కార్యకర్త ఎలా ఉండాలన్న దానికి జగదీషే ఆదర్శం. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. పార్టీ కోసం, టీఎన్‌టీయూసీ కోసం నిస్వార్థంగా పని చేసిన జగదీష్‌రి అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అన్నారు.

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న మాట్లాడుతూ... జగదీష్ ఇన్స్పిరేషన్‌గా ఉండేవారు. ఎప్పుడు కనిపించినా నవ్వుతూ పలకరించేవారు. పార్టీకి కమిటెడ్‌గా పనిచేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ... జగదీష్ సంతాప సభ జరుపుకోవడం చాలా బాధాకరంగా ఉంది. ఆయన పార్టీ అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలిచేవారన్నారు.

టీఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎంకే బోస్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అంటే ప్రాణంగా భావించే జగదీష్ మరణం చాలా బాధాకరం. ఆయన టీఎన్‌టీయూసీలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. టీడీపీ కార్యక్రమమైనా, టీఎన్‌టీయూసీ కార్యక్రమమైనా జగదీష్ ముందుండేవారు. ఆయన లేని లోటు తీర్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు అజ్మీరా రాజునాయక్, సూర్యదేవర లత, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యులు శ్రీపతి సతీష్, సంధ్యపోగు రాజశేఖర్, బాలరాజ్‌గౌడ్, టీఎన్‌టీయూసీ నాయకులు ఏబీఆర్ మోహన్‌రావు, యాదగిరి, మణిరాంసింగ్, జనార్ధన్ ప్రసంగించారు. కార్యక్రమంలో లీలా పద్మావతి, సాయినాగార్జున, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ గౌడ్, నర్సింహ, వేణుగోపాల్ రెడ్డి, గద్దల నారాయణ, బొల్లు మల్లయ్య, కనకరత్నం, పుణ్యకోటి శాస్త్రి, బుచ్చయ్య, ఎన్ఎస్ రాజు, శ్యామ్‌రాజ్, కిషన్‌నాయక్, తెలుగుదేశం ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# టీఎన్‌టీయూసీ బలోపేతమే లక్ష్యం

## ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం

## కార్మికులకు టీడీపీ అండ: పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్









**హైదరాబాద్ (చైతన్యరథం):** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అనుబంధ సంఘం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఇందులో కార్మికుల సమస్యలు, భవిష్యత్తులో జరగబోయే సింగరేణి ఎన్నికలు, టీఎన్‌టీయూసీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... టీడీపీ జెండా కనిపిస్తే మన పార్టీ చేసిన పనులు ప్రజలకు గుర్తుకొస్తాయన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రాబోయే రోజుల్లో బలంగా తయారు కాబోతోందని తెలిపారు. టీఎన్‌టీయూసీ బలంగా ఉంటేనే మృతి చెందిన టీఎన్‌టీయూసీ నాయకుడు వై.జగదీష్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. టీఎన్‌టీయూసీకి తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా సహకారం అందిస్తుందన్నారు.

టీఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎంకే బోస్ మాట్లాడుతూ... ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన టీఎస్ఆర్టీసీ కార్మిక పరిషత్ గెలుపే లక్ష్యంగా పని చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా ప్రచారం చేశారన్నారు. ఇందులో భాగస్వాములైన టీఎన్‌టీయూసీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సంఘానికి క్షేత్ర, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవడానికి పార్టీ అనుమతి కోరినట్టు చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, అజ్మీరా రాజునాయక్, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యుడు శ్రీపతి సతీష్, లీలా పద్మావతి, సంధ్యపోగు రాజశేఖర్, ఏవీఆర్ మోహన్‌రావు, యాదగిరి, సుబ్రహ్మణ్యం, మణిరాంసింగ్, జనార్ధన్, బుచ్చయ్య, వేణుగోపాల్ రెడ్డి, గద్దల నారాయణ, శ్యామ్‌రాజ్, పుణ్యకోటి శాస్త్రి, కనకరత్నం, ఎన్ఎస్ రాజు, బొల్లు మల్లయ్య, కొండి శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, తెలుగుదేశం ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బే ఏరియాలో అట్టహాసంగా

# దసరా, దీపావళి ధమాకా




**ప్లీసంటన్:** అమెరికాలోని ప్లీసంటన్ అలమేడా కౌంటీ ఫెయిర్ గ్రౌండ్స్‌లో అసోసియేషన్ ఆఫ్ ఇండో అమెరికన్స్ (AIA), బొల్లీ 92.3 ఎఫ్ఎం ఆధ్వర్యంలో దసరా దీపావళి ధమాకా (DDD)-2026 అత్యంత వైభవంగా జరిగింది. కాంతి, సంస్కృతి, సామాజిక స్ఫూర్తి సంగమంగా సాగిన ఈ వేడుకలకు దాదాపు 25వేలకు పైగా ఎన్నారైలు హాజరయ్యారు. ఇది దేశంలోనే అతిపెద్ద, అత్యంత శక్తివంతమైన వేడుకల్లో ఒకటిగా నిలిచింది. శాంతి, సమృద్ధి కోరుతూ నిర్వహించిన పవిత్ర మహా మంగళహారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం నిర్వహించిన అద్భుతమైన "దుర్గామా" రథయాత్ర భక్తిశ్రద్ధలు, సంగీతం, సాంస్కృతిక వైభవంతో ప్రాంగణాన్ని నింపింది. రామాయణ గాథ ఆధారంగా ప్రదర్శించిన రామ్‌లీలా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అద్భుతంగా నిర్మించిన 40 అడుగుల భారీ రావణాసురుడి దిష్టిబొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేల సంఖ్యలో ప్రజల సమక్షంలో ఈ దిష్టిబొమ్మను దహనం చేయగా... చెడుపై మంచి సాధించిన శాశ్వత విజయానికి ప్రతీకగా నిలిచింది. ఈ ఉత్సాహం ముగింపు ఘట్టమైన అద్భుతమైన బాణసంచా ప్రదర్శనతో మరింత ఉప్పొంగింది. లయబద్ధమైన సంగీతానికి తగ్గట్టుగా ఆకాశంలో బంగారు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగుల బాణసంచా వర్షం కురిపించింది. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా బాణసంచా ప్రదర్శన నిలిచింది.

500 మందికి పైగా ప్రతిభావంతులైన కళాకారులు ఇండోర్, అవుట్‌డోర్ స్టేజీలపై ప్రదర్శనలు ఇచ్చారు. శాస్త్రీయ, జానపద, బాలీవుడ్, ఫ్యూషన్ ప్రదర్శనలు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెప్పాయి. ఏఐఏ ఐడల్ సింగింగ్ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 135కి పైగా వెండర్ స్టాల్స్, 25 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిలో రుచికరమైన భారతీయ వంటకాలు, పండుగ మిఠాయిలు, సాంస్కృతిక వస్త్రాలు, ఆభరణాలు, హస్తకళలు, దీపావళి అలంకరణ వస్తువులు, ఫైనాన్షియల్, ట్యాక్స్, ఎడ్యుకేషనల్ రంగానికి సంబంధించిన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. పండుగ వెలుగుల నడుమ వేలాది మంది కలిసి గర్బా, దాండియా నృత్యాలతో ఉత్సాహంగా గడిపారు. ఇవి ఐక్యతను, ఆనందాన్ని ప్రతిబింబించాయి. వీటితో పాటు సిందూర కేళ, ధునుచి నాచ్, హనుమాన్ చాలీసా పఠనం, మహా ఖోజ్ (ట్రెజర్ హంట్), కార్నివాల్ రైడ్స్, చెస్ పోటీలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి.

ప్రవాసుల సాంస్కృతిక, పౌర ప్రభావాన్ని ప్రతిబింబించేలా ఈ వేడుకలకు కాన్సుల్ జనరల్ సతీష్ శివన్, అసెంబ్లీ సభ్యులు ఒర్లెగా ప్రతినిధి, శాన్‌రామన్ మేయర్ మార్క్ ఆర్మ్‌స్ట్రాంగ్, డబ్లిన్ మేయర్ షెర్రీ హు, ప్లీసంటన్ మేయర్ జాక్ బాల్చ్, ఫ్రీమాంట్ మేయర్ రాజ్ సల్వాన్, శాన్ రామన్ కౌన్సిల్ సభ్యులు శ్రీధర్ వెరోస్, శాన్‌రామన్ వైస్ మేయర్ మారిసోల్, బార్ట్‌బోర్డ్ ప్రెసిడెంట్ మెలిస్సా హెర్నాండెజ్, ప్లీసంటన్ కౌన్సిల్ సభ్యులు జూలీ టెస్టా విచ్చేశారు.

ఈ వేడుకలను విజయవంతం చేయడానికి సహకరించిన స్పాన్సర్లు డేవిడ్ హౌబర్ట్, సంజీవ్ గుప్తా సీపీఏ (ఫైర్‌వర్క్స్ స్పాన్సర్), డాక్టర్ ప్రకాష్, రియల్టర్ లావణ్య దువ్వి, ట్రావెలోపాడ్, రియల్టర్ నాగరాజ్ అన్నయ్య-లైఫాలజీ (ఎడ్యుకేషనల్ పార్ట్‌నర్), జూమ్ ఎ పేపాల్ సర్వీస్ (డైమండ్ స్పాన్సర్), గోపి డైరీ (పవర్డ్ బై) లకు ఏఐఏ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. సిరియా పసిఫిక్ ప్రైవేట్ వెల్త్, ఇన్‌స్టా సర్వీస్, మైపర్సు, వాచి సిల్క్స్, విజయ్ సూపర్‌మార్కెట్, కావ్య ఫుడ్స్, అపెక్స్ కన్సల్టింగ్, శాష్ట ఫ్రెష్, ఆజాద్ ఫైనాన్షియల్స్, మలబార్ జ్యువెలర్స్, జీహెచ్ ప్యాక్‌వెస్ట్ ఫౌండేషన్ ఇతర స్పాన్సర్లుగా వ్యవహరించాయి. మీడియా పార్ట్‌నర్లుగా తెలుగు టైమ్స్ సహా పలు సంస్థలు సహకరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, వెండర్లు, 100 మందికి పైగా వాలంటీర్ల అంకితభావం వల్లే ఈ భారీ వేడుక విజయవంతమైందని ఏఐఏ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.






## 'నెల నెలా తెలుగు వెన్నెల'లో భాగంగా

# నేడు దశావధానం

**టెక్సాస్:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో 'నెల నెలా తెలుగు వెన్నెల' అనే తెలుగు సాహిత్య వేదిక జరుగుతోంది. ఇందులో తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు భాషకి సంబంధించిన కార్యక్రమాలు వుంటాయి. FRISCO FLYERS EVENT CENTRE, 6300 FLYERS WAY FRISCO TX 75034 వేదికగా 19వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.




సంగీత, సాహిత్య, నృత్య సమ్మేళనం శనివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. కాగా 19వ వార్షికోత్సవం, 231వ సాహిత్య సదస్సుకు సాహితీ బంధువులందరికీ ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం సాదరంగా ఆహ్వానం పలుకుతోంది. ఈ సందర్భంగా హిందీ, తెలుగు మేలు కలయికలో తొలిసారిగా అవధాని, ప్రవాసాంధ్ర అవధాన ప్రభాకర బిరుదాంకితులు నేమాని లక్ష్మీ నరసింహ సోమయాజులు 'దశావధానం' నిర్వహిస్తున్నారు.

అధ్యక్షులు మాధవి లోకిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి చంద్రశేఖర్ రెడ్డి పొట్టిపాటి తక్షణ పూర్వాధ్యక్షుడు, దయాకర్ మాడ, సమన్వయకర్త, పాలకమండలి సభ్యులు, ఉదయ్ కిరణ్ నిడిగంటి ఉత్తరాధ్యక్షులు, కమలాకర్ దేవకొండ, నిడిగంటి గోవర్ధనరావు, సునీల్ సూరపరాజు, పవన్ కర్రా, లెనిన్ బందా, ఎన్‌కేవీన్ రాజు, లెనిన్‌బాబు వేముల, నవీన్ గొడవర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## న్యూయార్క్‌లో తెలుగు యువతి మృతి

**ఖమ్మం:** ఖమ్మం జిల్లాకు చెందిన ఓ యువతి అమెరికాలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందింది. తెలంగాణలోని ఖమ్మం వర్తక సంఘం దిగుమతి శాఖ అధ్యక్షుడు నల్లమల్ల ఆనంద్ కుమార్తె అక్షిత (26) అమెరికాలోని న్యూయార్క్ అల్బనీ ప్రాంతంలో నివసిస్తోంది. ఎంఎస్ చదివేందుకు



నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఆమె అక్కడే సోదరుడు అక్షయ్‌తో కలిసి ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి వద్ద వాకింగ్ చేస్తూ ఖమ్మంలో ఉన్న తండ్రితో ఫోన్‌లో మాట్లాడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే సోదరుడు అక్షయ్ బయటికి వచ్చి చూడగా... అక్షిత కింద పడిపోయి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తండ్రితో మాట్లాడిన కొద్దిసేపటికే అక్షిత మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న వర్తక సంఘం సభ్యులు, బంధుమిత్రులు ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అక్షిత పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## లివర్ మోర్‌లోని రాగసుధ సభ ఆధ్వర్యంలో

# కర్నాటక సంగీత కచేరీ




**కాలిఫోర్నియా:** లివర్ మోర్‌లోని రాగసుధ సభ ఆధ్వర్యంలో అద్భుతమైన 'కర్నాటక సంగీత కచేరీ' నిర్వహించనున్నారు. An evening of Carnatic artistry థీమ్‌తో ఈ నెల 25వ తేదీన ఈ కార్యక్రమం కచేరీ జరగనుంది. కాలిఫోర్నియాలోని లాస్ పొసిటాస్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న ప్రముఖ 'మెర్టెస్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' (4000 క్యాంపస్ హిల్ డ్రైవ్, లివర్‌మోర్, CA 94551) ఈ వేడుకకు వేదిక కానుంది. ఈ ప్రతిష్ఠాత్మక సంగీత కచేరీలో దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన పలువురు ప్రముఖ కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొన్ని కొన్ని సెషన్లుగా జరుగుతుంది. సంగీత రసజ్ఞులు కుటుంబీకులతో హాజరు కావాలని రాగసుధ సభ పిలుపునిచ్చింది.

**కళాకారుల వివరాలు:**

గాత్రం: విద్వాన్ కుమారి కిరణ్ & విద్వాన్ కుమారి నివి (సాయి సిస్టర్స్), విద్వాన్ కేవీఎస్ విష్ణుదేవ్

వయొలిన్: విద్వాన్ హెచ్ఎన్ భాస్కర్, విద్వాన్ అలన్‌కోడ్ గోకుల్.

మృదంగం: విద్వాన్ పత్రి సతీష్‌కుమార్, విద్వాన్ కేవీ ప్రసాద్.

కంజీర: విద్వాన్ బి.శ్రీసుందర్‌కుమార్ (అకా కంజీరమన్).

ఘటం: మాస్టర్ సత్య గణేషన్.

**మొదటి కచేరీ (మధ్యాహ్నం రెండు గంటలకు):** ప్రముఖ గాయనీమణులు విద్వాన్ కుమారి కిరణ్, విద్వాన్ కుమారి నివి (సాయి సిస్టర్స్) తమ మధురమైన గాత్రంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వీరికి వయొలిన్‌పై విద్వాన్ హెచ్ఎన్ భాస్కర్, మృదంగంపై విద్వాన్ పత్రి సతీష్‌కుమార్, కంజీరపై విద్వాన్ బి. శ్రీసుందర్‌కుమార్ (కంజీరమాన్) సహకారం అందిస్తారు.

**రెండవ కచేరీ (సాయంత్రం ఐదు గంటలకు):** ప్రముఖ గాయకులు విద్వాన్ కేవీఎస్ విష్ణుదేవ్ తన అద్భుతమైన గాత్ర కచేరీతో శ్రోతలను అలరించనున్నారు. వయొలిన్‌పై విద్వాన్ అలన్‌కోడ్ గోకుల్, మృదంగంపై విద్వాన్ కేవీ ప్రసాద్, ఘటంపై మాస్టర్ సత్య గణేషన్ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన స్పాన్సర్‌షిప్‌లు, విరాళాల కోసం ఆసక్తిగలవారు 5104497602, 5104497534, 5104498108 నెంబర్లను సంప్రదించవచ్చు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ www.raagasudhasabha.orgను సందర్శించవచ్చు (లేదా) సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో raagasudhasabha పేజీ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.



# యువ'శక్తి'తోనే బలమైన భారత్ నిర్మాణం

**- 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'లో ప్రధాని మోదీ**

దేశంలోని యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన భారత్‌ను నిర్మించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు కార్యక్రమం మూడు రోజులపాటు ఈ నెల 25 వరకు జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ... 1993లో ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానందతో జరిగిన తన చివరి సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ భేటీలో దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువశక్తిని పెంపొందించడంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు మోదీ వెల్లడించారు. స్వామిజీతో సమావేశం జరిగిన కొన్నేళ్లకే ప్రజలు తనకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారని, అప్పటి నుంచి తన విధానాలన్నింటిలోనూ యువతే కేంద్ర బిందువుగా నిలుస్తోందని మోదీ పేర్కొన్నారు. అలాగే, చికాగోలో జరిగిన 'పార్లమెంట్ ఆఫ్ ది వరల్డ్ రిలీజియన్స్' శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలంటూ తాను చేసిన ఆహ్వానాన్ని స్వామి చిన్మయానంద అప్పట్లో అంగీకరించిన విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు.

చిన్మయ మిషన్ కేవలం ఒక సాధారణ సంస్థ కాదని, ఒక సనాతన ఆధ్యాత్మిక తత్వానికి రూపమని మోదీ అభివర్ణించారు. తన నాగరికత మూలాల నుంచే భారతదేశం గుర్తింపు పొందుతోందని మోదీ స్పష్టం చేశారు. చిన్మయ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 300 రోజుల్లో 40,000 కిలోమీటర్లు ప్రయాణించి, లక్షలాది మందిని కలుసుకున్న యువతీయువకుల బృందాన్ని ప్రధాని ప్రశంసించారు. వేదాంత, భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ అందించే లక్ష్యంతో 1951లో స్వామి చిన్మయానంద ఈ మిషన్‌ను ప్రారంభించారు.

# భారత్, పోలాండ్ మధ్య రక్షణ బంధం

**- ఇరు దేశాల ప్రధానుల నిర్ణయం**

భారత్, పోలాండ్ మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్, ప్రధాని మోదీ మధ్య ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. ఇందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం ఉన్నాయి.

ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్, పోలాండ్‌లు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. తమ డ్రోన్లు ఎంతో ఉపయోగకరమని ఓ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అయితే వివరాలను వెల్లడించలేదు.

పోలాండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇందన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించాం. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించామని మోదీ పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జామ్నగర్, కొల్హాపూర్ రాజ కుటుంబాలు.. పోలాండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమిచ్చాయి. 2022లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలాండ్ సహకరించిందనిమోదీ వివరించారు.



**టుస్క్ గౌరవార్థం విందు**

పోలండ్ ప్రధాని టుస్క్ గౌరవార్థం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ విందు సమావేశం నిర్వహించారు. దీనికి 20 మంది పోలండ్ ప్రతినిధులు, 20 మంది భారత వాణిజ్య, పారిశ్రామిక, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.




## సరిహద్దుల్లో చైనాతో కొనసాగుతున్న ఘర్షణలు

**- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్**

చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు.. 2004లో చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారని తెలిపారు. మన దేశానికి చైనానే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన అంగీకరించారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవ దానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు. కాగా చైనాతో ఉన్న 3,488 కి.మీ. పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి ఈ ఐటీబీపీ పహారా కాస్తుంటుంది. ఎత్తైన ప్రదేశంలో జరిగే ఘర్షణలను ఎదుర్కోవడం శౌర్య కమాండోల ప్రత్యేకత.

# మెటా కళ్లద్దాలతో స్టింగ్ ఆపరేషన్

**- కర్ణాటక సీఎం డీకే తాజా ఆరోపణ**



స్టింగ్ ఆపరేషన్‌పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. తనపై స్టింగ్ ఆపరేషన్‌కు ప్రయత్నం జరిగిందని చెప్పారు. తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కూడా టార్గెట్ చేశారని ఆరోపించారు. స్థానిక మీడియాకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం ఈ ఆరోపణలు గుప్పించారు.

మెటా స్మార్ట్ కళ్లద్దాలు ధరించిన ఓ వ్యాపారవేత్త తనను కలిసేందుకు రావడంతో అనుమానం కలిగిందని కర్ణాటక సీఎం చెప్పారు. దీంతో, ఆ వ్యాపారవేత్త ఇంకా ఏయే రాజకీయ నాయకుల్ని కలిశారో తెలుసుకునేందుకు ప్రయత్నించానని అన్నారు. కాంగ్రెస్ నేతలే టార్గెట్‌గా భారీ స్టింగ్ ఆపరేషన్‌కు ప్రణాళికలు రెడీ అయ్యాయని ఆరోపించారు. అందులో భాగంగానే తనను టార్గెట్ చేశారని చెప్పారు.

అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకుని ఇటీవల ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చారని సీఎం డీకే శివకుమార్ చెప్పారు. తొలుత వ్యాపార వ్యవహారాలు మాట్లాడాక విషయం రాజకీయాలవైపు మళ్లిందని అన్నారు. రాజకీయ పరిణామాలు, బూత్ స్థాయి వ్యూహాల గురించి ఆ పారిశ్రామికవేత్త మాట్లాడటం ప్రారంభించారని చెప్పారు. చర్చ సడెన్‌గా రాజకీయాల వైపు మళ్లడంతో పాటు ఆ వ్యక్తి పెట్టుకున్న కళ్లద్దాలను చూశాక తనకు అనుమానం కలిగిందని అన్నారు.

వ్యాపారవేత్త గురించి పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కేరళ సీఎం వీడీ సతీశన్‌తో సమావేశం సందర్భంగా కూడా ఆ వ్యక్తి మెటా గ్లాసెస్ ధరించినట్టు తెలిసిందని అన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలతో సమావేశం సందర్భంగా మాత్రం ఆయన ఇలాంటి కళ్లద్దాలు పెట్టుకోనట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేబినెట్ సహచరులకు సూచించానని అన్నారు.

గతంలోనూ డీకే స్టింగ్ ఆపరేషన్ వ్యాఖ్యలు చేయగా.. కేంద్ర మంత్రి కుమారస్వామి తప్పుబట్టారు. మంత్రులను గుప్పిట్లో పెట్టుకునేందుకే ముఖ్యమంత్రి 'స్టింగ్ ఆపరేషన్' నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రులపై ఇదే ఆపరేషన్ చేసిన డీకే శివకుమార్.. ఏకంగా సీఎం పదవిని చేజిక్కించుకున్నారని విమర్శించారు.

# అమితాబ్ బంగ్లాను పేల్చేస్తామంటూ బెదిరింపులు



ముంబైలోని ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్ పంపించారు. ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోని ఒక పాఠశాలకు ఈ బెదిరింపు ఈ మెయిల్ వచ్చినట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. ఈ ఘటనపై ముంబై పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ బెదిరింపు ముంబైలో అమితాబ్ బచ్చన్‌కు చెందిన జల్సా, ప్రతీక్షల్లో ఏ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని వచ్చిందనే కోణంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

గతంలో ముంబై మహానగర పాలక సంస్థ కార్యాలయానికి కూడా ఇలాంటి బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఈ ఏడాది మార్చి 20వ తేదీన కూడా ముంబై ప్రెస్ క్లబ్‌కు ఇలాంటి బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. భవనం లోపల విషవాయువుతో కూడిన చిన్న చిన్న బాంబులను అమర్చినట్లు ఆ ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. అయితే అప్పుడు ప్రెస్ క్లబ్‌లో కూడా ఎలాంటి ప్రమాదకర వస్తువులు లభించలేదు.

# డెలివరీ బాయ్‌పై కస్టమర్ కర్కశత్వం

**- చిరిగిన రూ.10 నోటు మార్చి ఇవ్వాలని అడిగినందుకు అందరిముందు చెంపదెబ్బలు, దూషణలు**

**- అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్య, సెల్ఫీ వీడియోతో వెలుగులోకి**

చిరిగిన రూ.10 నోటును మార్చి ఇవ్వాలని కోరినందుకు ఓ కస్టమర్ దాడి చేయడంతో డెలివరీ బాయ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశ రాజధానిలో కలకలం రేపుతోంది. అందరి ముందు చెంపదెబ్బలు కొట్టడంతో పాటు తన పేదరికంపై అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ బాధిత యువకుడు రికార్డ్ చేసిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. తన పేదరికం కారణంగా తనకు న్యాయం జరగదని, అందుకే ప్రాణాలు తీసుకుంటున్నానని అతను చెప్పిన మాటలు హృదయాలను కదిలిస్తున్నాయి. ఈ ఘటన ఢిల్లీలో అక్టోబర్ 4న జరగగా.. డెలివరీ బాయ్‌కు సంబంధించిన వీడియో శుక్రవారం వెలుగులోకి వచ్చి వైరల్‌గా మారింది.

వీడియో ప్రకారం.. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో సమీర్ హుస్సేన్ (23) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అక్టోబర్ 4న రాత్రి 10.30 గంటలకు తూర్పు ఢిల్లీలోని వినోద్ నగర్‌లో రాంపాల్ సింగ్ అనే వ్యక్తికి కాఫీ ఆర్డర్ అందించేందుకు వెళ్లినట్లు సమీర్ తెలిపాడు. సుమారు రూ.150 విలువైన ఆర్డర్‌కు నగదు చెల్లించేందుకు కస్టమర్ 15 నిమిషాలు తీసుకున్నా తాను అభ్యంతరం చెప్పలేదని పేర్కొన్నాడు. అయితే, అతడు ఇచ్చిన రూ. 10 నోటు చిరిగినందున దానిని మార్చి ఇవ్వాలని మర్యాదగా కోరినందుకు కస్టమర్ తనను మూడుసార్లు చెంపదెబ్బ కొట్టాడని ఆరోపించాడు. తాను తిరిగి దాడి చేయలేదని, తన పేదరికాన్ని ప్రస్తావిస్తూ అవమానించడంతో తీవ్రంగా కలత చెందానని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. సైకిల్‌పై ఆర్డర్లు డెలివరీ చేస్తూ స్వయంకృషితో జీవించాలని కోరుకున్నానని చెప్పుకొచ్చాడు. తనకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు.

అనంతరం, అక్టోబర్ 5న సమీర్ విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని లాల్ బహదూర్ శాస్త్రి ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ అక్టోబర్ 20న ఆ యువకుడు మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, సమీర్‌కు న్యాయం చేయాలని అతని కుటుంబ సభ్యులు, తోటి డెలివరీ బాయ్స్ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన దేశ రాజధానిలో సంచలనంగా మారింది.

# టిబెట్‌లో భారీ భూకంపం



### 16 మంది మృతి, పలువురికి గాయాలు

టిబెట్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.0 తీవ్రతతో వచ్చిన ప్రకంపనలు భారీ ప్రభావాన్ని చూపించాయి. ఈ ఘటనలో కనీసం 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 32 మంది గాయపడినట్లు చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

టిబెట్‌లోని ఉత్తర ప్రాంతమైన నాగ్‌కు నగర పరిధిలో ఈ భూకంపం సంభవించింది. గురువారం రాత్రి స్థానిక కాలమానం ప్రకారం 10.33 గంటల సమయంలో భూమి కంపించింది. భూకంప కేంద్రం భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు చైనా భూకంప పర్యవేక్షణ సంస్థ వెల్లడించింది. టిబెట్ రాజధాని లాసా నుంచి ఈ ప్రాంతం సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. భూకంపం కారణంగా నాగ్‌కు ప్రాంతంలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. కనీసం 339 ఇళ్లు, ఇతర భవనాలు ధ్వంసమయ్యాయి. భూమి ఒక్కసారిగా కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప బాధితులను రక్షించేందుకు అధికారులు సహాయక చర్యలను వేగవంతం చేశారు. స్థానికంగా 1,600 మందికి పైగా సిబ్బందిని సహాయక చర్యల్లో భాగస్వాములను చేశారు. బాధితుల కోసం తాత్కాలిక నివాసాలు, గుడారాలు, పడకలు, చలిని తట్టుకునేందుకు అవసరమైన దుస్తులను అందిస్తున్నారు.

# పడవపై దాడి: 14 మంది భారతీయులు సురక్షితం

యెమెన్ లో జరిగిన పడవ దాడి ఘటనలో అందులోని 14 మంది భారతీయులు సురక్షితంగానే ఉన్నారని అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది. యెమెన్‌లోని హోడెడా పరిసర ప్రాంతాల్లో ఈ పడవ ఉందని.. అందులోని 14 మంది భారతీయులు సురక్షితంగానే ఉన్నారని వెల్లడించింది. వారికి ఎటువంటి అపాయం కలగకుండా తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. భారత పౌరులున్న లగ్జరీ పడవపై సౌదీ అరేబియా దాడి చేసిందని ఈ నెల 22న హూతీలు ఆరోపించిన విషయం తెలిసిందే. జబల్ జుకర్ ద్వీపం వద్ద ఈ దాడి జరిగిందని.. వారిని యెమెన్ సైన్యం రక్షించినట్లు పేర్కొన్నారు. ఇదే విషయంపై శుక్రవారం ఉదయం భారత దౌత్య కార్యాలయం స్పందిస్తూ.. విహార నౌకలో మన నావికులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొంది. వారు సురక్షితంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, దాడి ఎవరు చేశారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు.



ఇదిలాఉంటే, అంతర్జాతీయ నౌకా రవాణాలో భారత నావికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3 లక్షలకుపైగా భారతీయ నావికులు పనిచేస్తున్నట్లు అంచనా. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, నౌకలపై దాడుల్లో పలువురు భారత నావికులు గల్లంతు కావడం, ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది.

# అమెరికా వెళ్లే భారత విద్యార్థుల సంఖ్యలో భారీ క్షీణత

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో విడత అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై వివిధ రకాల ఆంక్షలతో విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఆగస్టులో స్టూడెంట్ వీసాలపై భారతదేశం నుంచి అమెరికా వెళ్లిన విద్యార్థుల సంఖ్య 39 శాతం తగ్గింది. సాధారణంగా ఫాల్ సెమిస్టర్‌కు ముందు విదేశీ విద్యార్థుల చేరిక అత్యధికంగా ఉండే ఈ నెలలో.. వరుసగా వార్షిక క్షీణత నమోదు కావడం గమనార్హం.



ఆగస్టులో ఎఫ్, ఎం కేటగిరీ వీసాలపై అగ్రరాజ్యానికి వచ్చిన భారతీయ విద్యార్థుల సంఖ్య 25,321గా అమెరికా వాణిజ్య శాఖకు చెందిన అంతర్జాతీయ వాణిజ్య పరిపాలన విభాగం వెల్లడించింది. గతేడాది ఈ కేటగిరీ వీసాలపై 41,540 మంది వెళ్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కొవిడ్ మహమ్మారి కారణంగా 2020లో ప్రయాణ ఆంక్షలు విధించిన సమయంలో విద్యార్థుల సంఖ్య 2,908కు పరిమితం కాగా.. ఆ తరువాత ఆగస్టు నెలలో నమోదైన అత్యల్ప సంఖ్య ఇదేనని తెలిపాయి. జోబైడెన్ అధికారంలో ఉన్న సమయంలోనూ విద్యార్థుల సంఖ్య కొంత మేర తగ్గినప్పటికీ.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇది మరింత వేగంగా పడిపోయింది.

కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అధిక వీసా తిరస్కరణ రేట్లు, ఉపాధి అవకాశాలు, పెరుగుతున్న విద్యావ్యయం వంటి అంశాలు కూడా భారతీయ విద్యార్థులను తమ ప్రణాళికలను పునఃపరిశీలించుకునేలా ప్రేరేపిస్తున్నాయని కన్సల్టెన్సీ సంస్థలు చెబుతున్నాయి.

# పాక్‌లో దారుణంగా మైనారిటీల హక్కుల ఉల్లంఘన

**- ఐరాస వేదికపై ఎండగట్టిన భారత్**

అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బదులిచ్చింది. ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధలో కొంత శాతమైనా పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. ఆ దేశంలో అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు.. అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరమని మంగళానందన్ పేర్కొన్నారు.

# బంగ్లా జైళ్లలోని విదేశీ ఖైదీల్లో సగం మంది భారతీయులే




బంగ్లాదేశ్ జైళ్లలోని విదేశీ ఖైదీలలో సగానికి పైగా భారతీయులే ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, బంగారం స్మగ్లింగ్ వంటి వివిధ నేరాలకు సంబంధించి 15 దేశాలకు చెందిన కనీసం 407 మంది విదేశీయులు బంగ్లాదేశ్ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు. వారిలో 238 భారతీయులు కాగా.. 168 మంది శిక్షాకాలం ఇప్పటికే పూర్తయ్యింది. వారిని స్వదేశానికి పంపే ఏర్పాట్లు ఇంకా పూర్తి కాకపోవడంతో నిర్బంధంలోనే ఉన్నారు. మిగిలిన వారిలో మయన్మార్, నైజీరియా, పాకిస్థాన్, మలేషియాలకు చెందిన వారు ఉన్నారు. జైలు శిక్ష పూర్తి చేసుకున్న భారతీయ ఖైదీల వివరాలను బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తమకు పంపించిందని ఆ దేశంలోని భారత హై కమిషన్ అధికారి ఒకరు తెలిపారు. వారు భారతీయులేనా కాదా అనే విషయాన్ని నిర్ధరించుకోవడంలో పలు సమస్యలు ఉండడంతో విడుదలలో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆ ఖైదీలను కలిసి, మాట్లాడేందుకు అక్కడి అధికారుల అనుమతి కోరామన్నారు. బంగ్లా విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి స్పందన కోసం ఎదురుచూస్తున్నామని.. ఖైదీల జాతీయతను ధ్రువీకరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

# మినాబ్ పాఠశాలపై దాడి.. పూర్తిగా ఏఐని తప్పుబట్టలేం

**- తుది నిర్ణయం తీసుకున్నది మనిషే కదా?**

**- సీఐఏ మాజీ డైరెక్టర్ పెట్రాయస్ సంచలన వ్యాఖ్యలు**



ఇరాన్‌లోని మినాబ్ నగరంలో బాలికల పాఠశాలపై జరిగిన ప్రాణాంతక దాడిపై అమెరికా నిఘా సంస్థ సీఐఏ మాజీ డైరెక్టర్, జనరల్ డేవిడ్ పెట్రాయస్ తాజాగా చేసిన వ్యాఖ్యలు యుద్ధరంగంలో ఏఐ వినియోగంపై కీలక చర్చకు దారితీశాయి. ఈ దాడిలో లక్ష్యాన్ని గుర్తించేందుకు ఏఐ సాయం చేసినప్పటికీ, దాడి చేయాలనే తుది నిర్ణయం తీసుకున్నది మనిషే కదా అని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మినాబ్ లోని పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఆ బాంబు దాడిలో 123 మంది విద్యార్థులు సహా 156 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అధిక సంఖ్యలో చిన్నారులు ఉన్నారు. అయితే, ఈ దాడిలో ఏఐ పాత్రపై రకరకాల వార్తలు వచ్చాయి. ఆ పాఠశాల ఉన్న స్థలంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నౌకాదళ విభాగం ఉండేది. ఆ స్థావరం గురించి ఏఐ తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే దాడి జరిగినట్టు చాలా విశ్లేషణలు వచ్చాయి.

ఢిల్లీలో జరుగుతున్న ఎన్‌డీటీవీ ప్రపంచ సదస్సుకు హాజరైన పెట్రాయస్‌ను ఈ దాడి గురించి ప్రశ్నించగా ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు యుద్ధాల్లో ఏఐ పాత్రపై మరోసారి విస్తృత చర్చకు దారితీశాయి. లక్ష్యాన్ని గుర్తించడంలో ఏఐ ఉపయోగపడిందని, అయితే తుది నిర్ణయం మనిషే తీసుకున్నాడని చెప్పారు. యుద్ధాల్లో ఏఐ విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, తప్పులు జరిగే అవకాశం ఉందని ఆయన అంగీకరించారు. మధ్యప్రాచ్యంతో పాటు ఉక్రెయిన్‌లోనూ ఇలాంటి పొరపాట్లు జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. కీలక నిర్ణయాలు తీసుకునే అధికారులు.. విమర్శకుల అభిప్రాయాలను, సందేహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఏదేమైనా, యంత్రాలు నిర్ణయ ప్రక్రియను వేగవంతం చేయగలిగినా, వాటి సూచనలను స్వతంత్రంగా పరిశీలించడం, లక్ష్యాన్ని సరిగ్గా నిర్ధారించడం, పౌరుల భద్రతను కాపాడడం అత్యంత కీలకమని పెట్రాయస్ పేర్కొన్నారు.

ఇప్పటికీ కొన్ని మృతదేహాలు లభ్యం కాలేదు. ఇరాన్ మినాబ్ స్కూల్ బాంబింగ్‌పై అమెరికా ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని ఇరాన్ దౌత్యవేత్త అయతుల్లా అబ్దుల్ మజిద్ హకీమ్ మండిపడ్డారు. ప్రాథమిక పాఠశాలను రెండుసార్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఏ పాపం తెలియని పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఈ పిల్లల్లో కొందరి మృతదేహాలు లభ్యంకాలేదు. వారి గుర్తుగా ఒక సమాధి కూడా లేదు. ఆ పరిస్థితి వారి తల్లితండ్రులను ఇంకా బాధిస్తోంది. ఇలా ఒక పాఠశాలపై దాడి చేసినందుకు అమెరికా ఇప్పటికీ క్షమాపణలు చెప్పలేదు. అది చాలదన్నట్లు ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ఐరాస ఒక దర్యాప్తు కమిటీని పంపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఆ విషయంలో కోహ్లి మాట తప్పాడు

**అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు**




భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ క్రికెటర్ అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు తాను గాయపడ్డానని.. ఫిట్‌గా తిరిగొస్తే జట్టులో చోటు కల్పిస్తానని హామీ ఇచ్చి మాట తప్పాడని ఆరోపించాడు. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అమిత్ మిశ్రా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమితుడైన సంగతి తెలిసిందే. తాజాగా ఆకాశ్ చోప్రా నిర్వహించిన ఓ ఇంటర్వ్యూలో అమిత్ మిశ్రా ఈ వ్యాఖ్యలు చేశాడు.

'2017లో ఇంగ్లండ్‌తో బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో నా కాలికి గాయమైంది. అప్పుడు టీమిండియా కోచ్‌గా అనిల్ కుంబ్లే ఉన్నారు. నేను జట్టును వీడే సమయంలో ఆయనతో మాట్లాడాను. ఫిట్‌నెస్ సాధించి తిరిగి వస్తే జట్టులోకి తీసుకుంటామని, ఆందోళన పడొద్దని చెప్పారు. అదే సమయంలో విరాట్ కోహ్లీ కెప్టెన్ అయ్యాడు. అతడిని కూడా జట్టులోకి తిరిగి రావడానికి ఏం చేయాలని అడిగాను. 'ఫిట్‌గా ఉండు.. జట్టులో చోటు ఉంటుంది' అని చెప్పాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత జట్టులోకి రీఎంట్రీ గురించి మళ్లీ కోహ్లీని సంప్రదించా. పది రోజుల్లో విషయం చెప్తానని హామీ ఇచ్చాడు. వారాలు గడిచినా ఇప్పటికీ ఎలాంటి స్పందనా లేదు. ఫోన్, మెసేజ్ చేశా.. సమాధానం రాలేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

నాకంటే తీవ్రంగా గాయపడిన ఆటగాళ్లు, ఎక్కువ కాలం జట్టుకు దూరంగా ఉన్నవాళ్లు కూడా తిరిగి వచ్చారు. కానీ నా విషయంలో మాత్రం ఏం జరిగిందో అర్థం కాలేదు. చివరికి నేను కూడా ప్రయత్నించడం మానేశాను. ఒకరికి మీరు అవసరం లేదనుకున్నప్పుడు మనం మాత్రం ఏం చేయగలం? ఇప్పటికీ నాకు ఎలాంటి సమాధానం రాలేదు' అని అమిత్ మిశ్రా ఆరోపించాడు. కాగా అమిత్ మిశ్రాకు ఆ మ్యాచ్.. అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో చివరిదిగా మిగిలిపోయింది.

**ఇషాన్ కిషన్‌కి గాయం..**

## రెండో టీ20కి దూరం



క్రైస్ట్‌చర్చ్: టీమిండియా క్రికెటర్ ఇషాన్ కిషన్ గాయపడ్డాడు. అతని కుడి కాలి తొడకండరం పట్టేయడంతో స్వల్ప స్థాయిలో నొప్పితో బాధపడుతున్నాడు. దీంతో అతడిని కివీస్‌తో జరిగే రెండో టీ20 మ్యాచ్‌కు దూరం పెట్టారు. బీసీసీఐ ఇవాళ ఇషాన్ కిషన్ గాయంపై అప్డేట్ ఇచ్చింది. తొలి టీ20 సమయంలో అతను గాయపడ్డాడు. అయితే అతని ఆరోగ్య పరిస్థితిపై బీసీసీఐ మెడికల్ టీమ్ ఫాలో అవుతోంది. ఫస్ట్ మ్యాచ్‌లో బ్యాటింగ్ సమయంలో ఇషాన్ కిషన్ బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా మార్పు చేశారు. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయాస్ అయ్యర్ ముందు వరసలో బ్యాటింగ్‌కు దిగారు. రెండో టీ20కి ఇషాన్‌ను తప్పించడంతో.. ఆ బ్యాటర్ స్థానంలో యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ఛాన్సు వచ్చే అవకాశం ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో వైభవ్ స్టాండ్స్‌కే పరిమితమైన విషయం తెలిసిందే.

# జావెలిన్ త్రోలో వరల్డ్ రికార్డు బ్రేక్ చేసిన హనే

నగోయా: ఏషియన్ పారా గేమ్స్‌లో భారత అథ్లెట్ హనే కొత్త రికార్డు సృష్టించాడు. జావెలిన్ త్రో ఈవెంట్‌లో హనే రెండు ప్రపంచ రికార్డులను బ్రేక్ చేశాడు. మెన్స్ జావెలిన్ ఎఫ్37-38 ఈవెంట్‌లో జావెలిన్‌ను 60.49 మీటర్ల దూరం విసిరి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. హనే తన ఐదో ప్రయత్నంలో జావెలిన్‌ను 59.72 మీటర్ల దూరం విసిరి కొత్త ప్రపంచ రికార్డు క్రియేట్ చేశాడు. అయితే ఆ తర్వాత తన చివరి ప్రయత్నంలో మళ్లీ కొత్త రికార్డు బ్రేక్ చేయడం గమనార్హం. తన అద్భుతమైన త్రోతో అతను స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు.



# అంతర్జాతీయ క్రికెట్‌కు మేఘన గుడ్‌బై

భారత మహిళా క్రికెటర్ మేఘన సబ్బినేని అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. తన క్రికెట్ ప్రయాణంలో అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, అభిమానులకు మేఘన కృతజ్ఞతలు తెలిపింది. 30ఏళ్లకే ఆటకు దూరమవుతున్నట్లు ప్రకటించడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.



'చేతిలో బ్యాట్ పట్టుకుని మైదానంలోకి అడుగుపెట్టి ప్రపంచ వేదికపై దేశ జెర్సీ ధరించడం నా కల. అది నిజమైంది. అన్ని ఫార్మాట్ల క్రికెట్‌లో ప్లేయర్‌గా నా ప్రయాణాన్ని ముగించాలని నిర్ణయించుకున్నా. ఈ సమయంలో నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. మైదానం నాకు రెండో ఇల్లు లాంటిది. పట్టుదల, వినయాన్ని నేర్పడంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలు, స్నేహాలను అందించింది. అయితే ఆటకు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ క్రికెట్‌తో నా అనుబంధం కొనసాగుతుంది. భవిష్యత్తులో యువ క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తూ, ఆట అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని భావిస్తున్నా' అని మేఘన వెల్లడించింది.

**ఆంధ్రప్రదేశ్ నుంచి టీమిండియా వరకు...**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కుడిచేతి వాటం బ్యాటర్ మేఘన 2016 నవంబరులో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసింది. 2022 ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో వన్డేల్లోకి ప్రవేశించింది. భారత జట్టు తరపున మూడు వన్డేలు, 17 టీ20లు ఆడింది. వన్డేల్లో 114 పరుగులు, టీ20ల్లో 258 పరుగులు సాధించింది. మేఘన కెరీర్‌లో 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ ఓ ముఖ్యమైన మైలురాయి. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో తొలిసారిగా మహిళల క్రికెట్‌కు చోటు కల్పించగా... భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అయితే తుది పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలై రజత పతకంతో సరిపెట్టుకుంది. ఆ జట్టులో మేఘన కూడా సభ్యురాలిగా ఉంది.

**బీసీసీఐ జూనియర్ క్రికెట్ టీమ్ చీఫ్ సెలెక్టర్‌గా**

# భారత మాజీ పేసర్ పర్వీందర్ అవానా



బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా టీమిండియా మాజీ క్రికెటర్ పర్వీందర్ అవానాను నియమించింది. క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియ అనంతరం అవానా పేరును సిఫార్సు చేసింది. ఈ కమిటీలో కృష్ణ దాస్, రాకేశ్ పటేల్, ఎన్.అర్జున్ యాదవ్‌లకు కూడా సభ్యులుగా అవకాశం కల్పించింది. మరో సభ్యుడిని త్వరలో నియమించనున్నట్లు బీసీసీఐ వెల్లడించింది.

మాజీ పేసర్ పర్వీందర్ అవానా భారత్ తరపున రెండు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లే ఆడటం గమనార్హం. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 62 మ్యాచ్‌లు ఆడి 191 వికెట్లు పడగొట్టాడు. దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు ఇండియా-ఎ, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లలోనూ ఆడాడు. ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత పర్వీందర్ కోచింగ్ వైపు అడుగులు వేశాడు. ఢిల్లీ అండర్-16, అండర్-19, అండర్-23 జట్లకు కోచ్‌గా పని చేశాడు. భారత అండర్-19 జట్టు, బీసీసీఐ హై పెర్ఫార్మెన్స్ కార్యక్రమాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కార్యక్రమాల్లోనూ సేవలు అందించాడు. ఈ అనుభవం ఇప్పుడు జూనియర్ ఆటగాళ్ల ఎంపికలో ఉపయోగపడనుంది.

## 74 ఏళ్ల వయసులో అసాధారణ ప్రతిభ

**వరల్డ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో శంకరరావుకు రెండు పతకాలు**




యూఎస్ఏ: / వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, బలమైన సంకల్పం ఉంటే సాధించలేనిదేమీ లేదని నిరూపించారు భద్రాచలానికి చెందిన 74 ఏళ్ల ఎస్‌బీఐ విశ్రాంత అధికారి డీవీ శంకరరావు. గుండెకు బైపాస్ సర్జరీ జరిగినా వెనకడుగు వేయకుండా ప్రపంచ పవర్ లిఫ్టింగ్ వేదికపై భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. వారం వ్యవధిలోనే రెండు అంతర్జాతీయ పతకాలను సాధించి సంచలనం సృష్టించారు. యుఎస్‌లోని రెనో నగరం వేదికగా గురువారం జరిగిన 'వరల్డ్ మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్'లో 74 కేజీల 'మాస్టర్స్-4' విభాగంలో శంకరరావు రజత పతకం సొంతం చేసుకున్నారు. ఇదే వేదికపై ఈ నెల 15న జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. ఒకే చాంపియన్‌షిప్‌లో వేర్వేరు విభాగాల్లో రెండు పతకాలు సాధించడంతో క్రీడాభిమానులు, స్థానికులు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 10కి పైగా అంతర్జాతీయ, జాతీయ పతకాలు సాధించిన శంకరరావు ప్రయాణం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలి కొనసాగించవచ్చని నిరూపిస్తూ లక్షలాది మందికి ఆయన ప్రేరణగా నిలిచారు.




## 400 మీటర్ల స్ప్రింట్‌లో వరల్డ్ రికార్డు

**- సందీప్ కుమార్‌కు స్వర్ణ పతకం**

నగోయా: ఏషియన్ పారా గేమ్స్‌లో ఇండియా ఖాతాలో పతకాలు వచ్చి చేరుతున్నాయి. ఇవాళ గేమ్స్ 5వ రోజు స్ప్రింటర్ సందీప్ కుమార్ స్వర్ణం గెలిచాడు. 400 మీటర్ల టీ44 ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. అతను లక్ష్యాన్ని 52.28 సెకన్లలో అందుకున్నాడు. సందీప్ తన పర్ఫార్మెన్స్‌తో ప్రపంచ రికార్డును క్రియేట్ చేశాడు. ఇవాళ జరిగిన ఫైనల్లో సౌదీ అరేబియాకు చెందిన నూర్ అల్సనా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మరో భారత అథ్లెట్ అజయ్‌కుమార్ కూడా ఇదే ఈవెంట్‌లో రాణించాడు. అతను లక్ష్యాన్ని 53.61 సెకన్లలో అందుకుని కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అజయ్‌కుమార్ కూడా ఏషియన్ గేమ్స్ రికార్డును స్థాపించాడు. 400 మీటర్ల స్ప్రింట్‌లో రెండు మెడల్స్ రావడంతో.. ప్రస్తుత పారా గేమ్స్‌లో భారత బృందం సాధించిన పతకాల సంఖ్య వంద దాటింది.

## హాలీవుడ్‌లో ఒక్క సినిమా అయినా చేయాలనుంది: దర్శకధీరుడు రాజమౌళి



భారతీయ చలనచిత్ర రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి హాలీవుడ్ ఎంట్రీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో కనీసం ఒక్క హాలీవుడ్ సినిమా అయినా తెరకెక్కించాలని తాను గట్టిగా కోరుకుంటున్నట్లు వెల్లడించారు. బ్రెజిల్‌లో జరుగుతున్న 50వ సావో పాలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో పాల్గొన్న ఆయన తన తదుపరి చిత్రం 'వారణాసి'తో పాటు హాలీవుడ్ అవకాశాల గురించి పలు విషయాలను పంచుకున్నారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో సృష్టించిన ఘన విజయం తర్వాత హాలీవుడ్ నుంచి తనకు అనేక నిర్మాణ సంస్థల నుంచి ఆఫర్లు వచ్చాయని రాజమౌళి తెలిపారు. "అక్కడి పనితీరు, నిర్మాణత్మక శైలి ఎంతో అద్భుతంగా ఉంటాయి. నేను అక్కడి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అందుకే హాలీవుడ్‌లో కనీసం ఒక చిత్రమైనా చేయాలని ఉంది" అని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. హాలీవుడ్ ఆఫర్లు వచ్చినప్పటికీ, అప్పటికే తన తదుపరి ప్రాజెక్టు 'వారణాసి' పనులు ప్రారంభమయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

"నేను ఒకేసారి రెండు, మూడు ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేను. ఒక సినిమా పూర్తిగా పూర్తయిన తర్వాతే మరొక దానిపై దృష్టి సారిస్తాను. ప్రస్తుతం నా దృష్టి అంతా 'వారణాసి'పైనే ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే హాలీవుడ్ ఆఫర్ల గురించి కచ్చితంగా ఆలోచిస్తాను" అని రాజమౌళి తేల్చి చెప్పారు.

## శ్రీకార్తిక్ మూవీ... హీరోయిన్‌గా రుక్మిణి వసంత్




టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఎంతో ఆసక్తి రేకెత్తిస్తోన్న ఒక క్రేజీ రోడ్ ట్రిప్ కామెడీ డ్రామా చిత్రంలో టాలెంటెడ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ భాగమయ్యారు. యువ దర్శకుడు శ్రీకార్తిక్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె 'తార' అనే వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు.

ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక పరిచయ వీడియోను తాజాగా చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ ఫన్నీ ప్రోమోలో దర్శకుడు శ్రీకార్తిక్ చాలా వినోదాత్మక రీతిలో కథను వివరించడం, ఆ నరేషన్ నచ్చడంతో రుక్మిణి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చూపించారు.

ఈ ప్రమోషనల్ వీడియో ప్రస్తుతం సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానుండగా, చిత్ర యూనిట్ త్వరలోనే అధికారిక టైటిల్‌ను కూడా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది.

## ప్రభాస్ బర్త్‌డే స్పెషల్

## 'స్పిరిట్' సెట్స్ నుంచి సందీప్‌రెడ్డి వంగా సర్‌ప్రైజ్ పోస్ట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తమ అభిమాన హీరో పుట్టిన రోజు కావడంతో ప్రభాస్ కొత్త సినిమాల నుంచి ఏదైనా ప్రత్యేక ప్రకటన వస్తుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ క్రమంలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అభిమానులకు ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చారు. ప్రభాస్‌తో కలిసి 'స్పిరిట్' సినిమా సెట్స్‌లో దిగిన ఫొటోను పంచుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా కలిసి ఉన్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో సందీప్ రెడ్డి వంగా చేతిలో మందు బాటిల్ పట్టుకుని ఉండగా, ప్రభాస్ నవ్వుతూ దానిని చూపిస్తూ ఆయనతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్నారు. ఈ ఫొటోను పంచుకున్న సందీప్‌రెడ్డి వంగా.. "అన్నా.. లెట్స్ పార్టీ! ఇవాళ నీ పుట్టినరోజు. పుట్టినరోజు శుభాకాంక్షలు ప్రభాస్ అన్నా" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రభాస్‌తో సందీప్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ ఫొటో ప్రతిబింబిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తమ అభిమాన హీరో పుట్టినరోజున దర్శకుడు పంచుకున్న ఈ ప్రత్యేక ఫొటోను విపరీతంగా షేర్ చేస్తున్నారు.

ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాలతో తనదైన శైలిని చాటుకున్న సందీప్.. ప్రభాస్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ సినిమా నుంచి ఏదైనా కొత్త సమాచారం వస్తుందేమోనని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటనల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయంలో సందీప్ రెడ్డి వంగా పంచుకున్న ఈ ఫొటో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో 'స్పిరిట్'కు సంబంధించిన మరిన్ని వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## భారీ మల్టీస్టారర్‌కు రెడీ అవుతున్న నెల్సన్



జైలర్2తో మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్న డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ నెక్ట్స్ ప్రాజెక్టులపై సినీ వర్గాల్లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ జరుగుతోంది. కోలీవుడ్‌లో ఎప్పటి నుంచో ఆసక్తి రేకెత్తిస్తున్న రజినీకాంత్, కమల్ హాసన్ కలయికలో సినిమా తెరకెక్కించేందుకు నెల్సన్ రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కథ ఆల్రెడీ రెడీ అయిందని, దాన్ని ఫుల్ లెంగ్త్ స్క్రీన్‌ప్లేగా మలిచేందుకు నెల్సన్ దాదాపు ఆరు నెలల టైమ్ కేటాయించనున్నారని సమాచారం. నెక్ట్స్ ఇయర్ ఈ సినిమా షూటింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయి. కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ భారీ మల్టీస్టారర్‌ను నిర్మించనుందని టాక్. ఈ సినిమా ఆగిపోయిందంటూ గతంలో వచ్చిన ఊహాగానాలకు భిన్నంగా, ప్రాజెక్టు ముందుకు సాగుతోందనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది.

## సూర్య 'సీన్' చిత్రంలో విలన్‌గా నస్లేన్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'సీన్'. తాజాగా ఈ సినిమాకు సంబంధించి చిత్ర యూనిట్ విడుదల చేసిన అప్‌డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో నస్లేన్ 'ఈశ్వరన్' అనే విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ చిత్రంలో హీరో సూర్య ఒక శక్తివంతమైన పోలీస్ అధికారిగా డీఎస్పీ ఇన్బరాజ్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య సరసన నజ్రియా ఫహాద్ నటిస్తుండగా, మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. సూర్య, జ్యోతిక నూతన ప్రొడక్షన్ హౌస్ 'జగరం స్టూడియోస్' '2డి ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా దీపావళి కానుకగా నవంబరు 6న థియేటర్లలో అట్టహాసంగా విడుదల చేయనున్నారు. నస్లేన్ విలన్ ఎంట్రీ, సూర్య పోలీస్ గెటప్ కలిసి ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి.







## 'ఇడుపు కాయితం' నుంచి

## సెకండ్ సింగిల్ 'గడప' పాట విడుదల

టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్-బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ 'శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..' పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.